RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -319 పేజీలు - 08 వెల - 04/- గురువారం 9 అక్టోబర్ 2025



# రికార్డు స్థాయిలో పెట్టుబడులు

రూ.1.14 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం

వివిధ రంగాల్లో 30కిపైగా ప్రాజెక్టులకు ఆమోదం

రూ.87,520 కోట్లు పెట్టుబడి పెట్టనున్న రైడెన్ ఇన్ఫోటెక్

**అమరావతి, అక్టోబర్ 8 ఆంధ్ర ప్రగతి :** ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో నిర్వహించిన 11వ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో రూ. 1.14 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ఐటీ, ఇంధనం, టూరిజం, ఏరోస్పేస్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో 30కిపైగా ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. వీటి ద్వారా 67 వేల ఉద్యోగాలు వస్తాయని అంచనా. ఎప్పుడూ లేని విధంగా అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది.

మిగతా 2లో.





# స్వదేశీని మంత్రాన్ని స్వీకరించండి

## దేశాన్ని బలోపేతం చేయండి: ప్రధాని మోదీ

- నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభించిన ప్రధాని మోదీ
- ప్రతి ఒక్కరూ 'స్వదేశీ' మంత్రాన్ని పాటించాలని ప్రజలకు పిలుపు
- దేశీయ వస్తువుల వాడకంతోనే అభివృద్ధి, ఉద్యోగాల కల్పన సాధ్యమని స్పష్టం
- మహారాష్ట్రలో అఘాడీ ప్రభుత్వం అభివృద్ధి ప్రాజెక్టులను నిలిపివేసిందని ఆరోపణ

2లో.

# నేడు నోటిఫికేషన్

స్థానిక ఎన్నికలకుహైకోర్టులో విచారణ ఉన్నప్పటికి ప్రక్రియ మొదలు

అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డితో మంత్రుల మంతనాలు

**హైదరాబాద్, అక్టోబర్ 8 ఆంధ్ర ప్రగతి :** తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి గురువారం యథావిధిగా నోటిఫికేషన్ విడుదల కానుంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉదయం 10.30 గంటలకు నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది. హైకోర్టులో బీసీ రిజర్వేషన్లపై విచారణ నేటికి వాయిదా పడినప్పటికీ, ఎన్నికల

మిగతా 2లో.




# నేడు అనకాపల్లిలో జగన్ పర్యటన

భారీగా ఏర్పాటు చేస్తున్న వైకాపా శ్రేణులు

**విశాఖపట్నం,అక్టోబర్ 8 ఆంధ్ర ప్రగతి :** మాజీ సీఎం వైఎస్ జగన్ అనకాపల్లి జిల్లా పర్యటన ఖరారైంది.. అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలను పరిశీలించనున్నారు. తాజాగా జగన్ పర్యటన షెడ్యూల్ విడుదల చేశారు.. బుధవారం ఉదయం 9.20 గంటలకు తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరుతారు. 9.50 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు..

మిగతా 2లో.






2లో.

ఏపీలో ఐదు విశ్వవిద్యాలయాలకు

# వీసీల నియామకం

ఉత్తర్వులు జారీ చేసిన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

నాగార్జున యూనివర్సిటీ వీసీగా వెంకటసత్యనారాయణరాజు

తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ వీసీగా తాతా నర్సింగరావు

జేఎన్‌టీయూ, యోగి వేమన, ఆర్కిటెక్చర్ వర్సిటీలకు కూడా

విద్యా వ్యవస్థ బలోపేతమే లక్ష్యంగా నియామకాలు

# కల్తీ మద్యంపై వైకాపా దుష్ప్రచారం

గట్టిగా తిప్పికొట్టాలని మంత్రులకు బాబు ఆదేశం



**అమరావతి, అక్టోబర్ 8 ఆంధ్ర ప్రగతి :** ఆంధ్రప్రదేశ్‌లో నకిలీ మద్యం వ్యవహారం కలకలం రేపింది.. అయితే, రాష్ట్రంలో నకిలీ మద్యానికి సంబంధించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు.. పలువురు మంత్రులు, ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించిన సీఎం చంద్రబాబు..

మిగతా 2లో.

బాణాసంచా తయారీ కేంద్రంలో పేలుడు

# ఆరుగురు దుర్మరణం

పలువురికి గాయాలు..ఆస్పత్రికి తరలింపు

ఘటనపై సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

తక్షణ సహాయక చర్యలకు ఆదేశం

**కోనసీమ,అక్టోబర్ 8 ఆంధ్ర ప్రగతి :** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. రాయవరంలోని గణపతి గ్రాండ్ బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు సంభవించింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. మంటల్లో చిక్కుకుని ఆరుగురు సజీవ దహనమయ్యారు. మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని అనపర్తి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మిగతా 2లో.



స్థానిక ఎన్నికలపై

# స్టే ఇవ్వని హైకోర్టు

పిటిషనర్లు, ప్రభుత్వ లాయర్ల మధ్య

వాడీవేడిగా వాదనలు

కేసులో 30 ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు




2లో.

# రసాయనశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ వెల్లడి మెటల్-ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్ అభివృద్ధి



**స్టాక్‌హోంఅక్టోబర్ 8 ఆంధ్ర ప్రగతి :** రసాయన శాస్త్రంలో విశేష పరిశోధనలు జరిపిన ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ బహుమతి లభించింది. మెటల్–ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్ అభివృద్ధి చేసినందుకు గాను సుసుము కిటాగవా, రిచర్డ్ రాబ్సన్, ఒమర్ ఎం యాఘీలకు ఈ పురస్కారాన్ని అందించనున్నట్టు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ వెల్లడించింది.

మిగతా 2లో.

నేడు సొంత నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ పర్యటన...

# మత్స్యకారుల కోసం సముద్రంలో ప్రయాణం

గురువారం నాడు పిఠాపురం నియోజకవర్గంలో పవన్ పర్యటన

ఉప్పాడ మత్స్యకారులతో భేటీ, వారి సమస్యలు తెలుసుకోనున్న పవన్

సముద్ర కాలుష్యంపై స్వయంగా పరిశీలనకు పడవ ప్రయాణం

మత్స్యకారులను ఉద్దేశించి ఉప్పాడలో ప్రసంగం

నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**పిఠాపురం అక్టోబర్ 8 ఆంధ్ర ప్రగతి :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ తన నియోజకవర్గంలో క్షేత్రస్థాయి పర్యటనకు సిద్ధమయ్యారు. గురువారం (అక్టోబర్ 9) ఆయన పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించి,



మిగతా 2లో.

# రికార్డు స్థాయిలో పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి)

రూ.87,520 కోట్లు పెట్టుబడి పెట్టనున్న రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్‌కు ఆమోదించింది. రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్ ఏర్పాటును అతి పెద్ద ఘనతగా ఎస్ఐపీబీ భావిస్తోంది. మూడు 3 గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఎస్ఐపీబీ సమావేశంలో ప్రాజెక్టుల వారీగా లోతైన చర్చ జరిగింది. భారీ ప్రాజెక్టులకు ప్రత్యేక అధికారుల నియామకానికి ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. కంపెనీలు త్వరగా గ్రౌండ్ అయ్యేలా ప్రత్యేక అధికారులు బాధ్యత తీసుకోనున్నారు. ఐటీ, ఇంధనం, టూరిజం, ఎరోస్పేస్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో 30కిపైగా ప్రాజెక్టులకు ఈ సమావేశంలో ఆమోదం లభించింది. వీటి ద్వారా 67 వేల ఉద్యోగాలు వస్తాయని అంచనా. దేశ చరిత్రలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడికి 11వ ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. రూ.87,520 కోట్లు పెట్టుబడి పెట్టనున్న రైడెన్ ఇన్ఫో టెక్ డేటా సెంటర్‌కు కు ఈ సమావేశంలో ఆమోదం లభించింది. గతంలో ఎప్పుడూ ఈ స్థాయిలో ఎఫ్‌డీఐ రాలేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అతిపెద్ద ఫారిన్ ఇన్వెస్టిమెంట్ సాధించడంపై ఐటీ మంత్రి నారా లోకేష్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు అభినందనలు తెలియజేశారు. 15 నెలల కాలంలో పెట్టుబడుల ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇప్పటి వరకు జరిగిన 11 ఎస్ఐపీబీల ద్వారా రూ. 7.07 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. దీని ద్వారా 6.20 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. 15 నెలల కాలంలో పెట్టుబడుల ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. 3గంటల పాటు సాగిన ఈ సమావేశంలో ప్రాజెక్టుల వారీగా లోతైన చర్చ జరిగింది. భారీ ప్రాజెక్టులకు ప్రత్యేక అధికారులను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కంపెనీలు త్వరగా గ్రౌండ్ అయ్యేలా బాధ్యతను ప్రత్యేక అధికారులు తీసుకోనున్నట్లు వెల్లడించింది. ఇప్పటి వరకు జరిగిన ఃూఎఖఃల ద్వారా రూ.7.07 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. 6.20 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# ఏపీలో ఐదు విశ్వవిద్యాలయాలకు వీసీల నియామకం

**అమరావతి, అక్టోబర్ 8 (రిపబ్లిక్ న్యూస్)**

రాష్ట్రంలో ఉన్నత విద్యావ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని ఐదు ప్రధాన విశ్వవిద్యాలయాలకు కొత్త ఉపకులపతులను (వైస్ ఛాన్సలర్‌లను) నియమిస్తూ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని కీలక యూనివర్సిటీలకు పూర్తిస్థాయి వీసీలను నియమించడంతో పాలన, విద్యా కార్యకలాపాలు వేగవంతం కానున్నాయి.ఈ ఉత్తర్వుల ప్రకారం, గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి వెంకటసత్యనారాయణరాజు సమంతపుడిని, తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి తాతా నర్సింగరావును వీసీలుగా నియమించారు. అదేవిధంగా, కడపలోని వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి బి. జయరామిరెడ్డి, విజయనగరంలోని జేఎన్‌టీయూకు వి. వెంకటసుబ్బారావు, కడప యోగి వేమన విశ్వవిద్యాలయానికి రాజశేఖర్ బెల్లంకొండను వీసీలుగా నియమిస్తూ గవర్నర్ నిర్ణయం తీసుకున్నారు.రాష్ట్రంలోని ఈ కీలక విశ్వవిద్యాలయాల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, పరిశోధనలను ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ నియామకాలు జరిగినట్లు తెలుస్తోంది. కొత్తగా నియమితులైన వీసీలు తమ అనుభవంతో ఆయా విశ్వవిద్యాలయాల అభివృద్ధికి దోహదపడతారని ప్రభుత్వం ఆశిస్తోంది. ఈ నియామకాలతో వర్సిటీల పాలన, విద్యా కార్యకలాపాలు మరింత మెరుగుపడతాయని విద్యావేత్తలు భావిస్తున్నారు.

# స్వదేశీ మంత్రాన్ని స్వీకరించండి

## దేశాన్ని బలోపేతం చేయండి: ప్రధాని మోదీ

**ముంబై, అక్టోబర్ 8 ఆంధ్ర ప్రగతి :**

దేశ ప్రజలు 'స్వదేశీ'ని స్వీకరించి, దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. బుధవారం నవీ ముంబైలో అంతర్జాతీయ విమానాశ్రయం మొదటి దశను ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. స్వదేశీ వస్తువుల వాడకం వల్ల దేశంలో అభివృద్ధి వేగవంతం అవ్వడమే కాకుండా, యువతకు మరిన్ని ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఆయన అన్నారు.



"ప్రతి ఒక్కరూ గర్వంగా 'స్వదేశీ' అని చెప్పాలి. ఇది ప్రతి పౌరుడికి, మార్కెట్‌కు ఒక మంత్రంలా మారాలి. ప్రజలు దేశీయ వస్తువులను కొనుగోలు చేసి, వాటినే బహుమతులుగా ఇస్తే ఆ డబ్బు తిరిగి మన ఆర్థిక వ్యవస్థకే చేరుతుంది. తద్వారా వృద్ధి, ఉపాధి పెరుగుతాయి" అని ప్రధాని మోదీ వివరించారు. జీఎస్టీ సంస్కరణల వల్ల దేశానికి, ప్రజలకు ఎంతో మేలు జరిగిందని, ఇటీవల ముగిసిన నవరాత్రుల్లో అమ్మకాలు భారీగా జరగడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ప్రధాని మోదీ గత యూపీఏ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 2008 ముంబై ఉగ్రదాడుల తర్వాత పాకిస్థాన్‌పై ఎందుకు దాడి చేయలేదని, ఎవరి ఒత్తిడితో ఆనాటి ప్రభుత్వం ఆ నిర్ణయం తీసుకుందో దేశం తెలుసుకోవాలనుకుంటోందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ బలహీన విధానాల వల్లే ఉగ్రవాదులు రెచ్చిపోయారని, దేశ భద్రత బలహీనపడిందని ఆరోపించారు. తమ ప్రభుత్వానికి మాత్రం దేశ భద్రతే అత్యంత ప్రాధాన్యమని, 'ఆపరేషన్ సిందూర్' ద్వారా పాకిస్థాన్‌కు గట్టి సమాధానం ఇచ్చామని గుర్తుచేశారు.

అంతేకాకుండా, మహారాష్ట్రలోని గత మహా వికాస్ అఘాడీ ప్రభుత్వం అనేక అభివృద్ధి ప్రాజెక్టులను నిలిపివేయడం వల్ల దేశానికి తీవ్ర నష్టం వాటిల్లిందని మోదీ విమర్శించారు. నవీ ముంబై విమానాశ్రయం, ఇతర కనెక్టివిటీ ప్రాజెక్టులతో ముంబై నగరం ప్రపంచస్థాయి వృద్ధి కేంద్రంగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. "ఈ ఎయిర్‌పోర్ట్ 'వికసిత భారత్' సంకల్పానికి ప్రతీక. దీని ద్వారా రైతులు తమ ఉత్పత్తులను యూరప్, గల్ఫ్ దేశాలకు సులభంగా ఎగుమతి చేయవచ్చు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు లబ్ధి చేకూరుతుంది" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ ముంబై మెట్రో లైన్-3 చివరి దశను కూడా ప్రారంభించారు. దీంతోపాటు 'ముంబై వన్ యాప్', యువతకు ఉపాధి ఆధారిత శిక్షణ అందించే 'ముఖ్యమంత్రి షార్ట్-టర్మ్ ఎంప్లాయబిలిటీ ప్రోగ్రామ్ 'ను కూడా ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతులు, ప్రజల కోసం విశేష కృషి చేసిన లోక్‌నేత డీబీ పాటిల్ సేవలను ఆయన స్మరించుకున్నారు.

# కల్తీ మద్యంపై వైకాపా దుష్ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రం అంతా కల్తీ మద్యం అంటూ ప్రజలను భయపెడుతున్నారు.. ఈ దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.. అయితే, రాష్ట్రంలో మద్యం మరణాలపై విచారణ చేయాలని ఆదేశించారు.. ఇక, రాజకీయ కుట్రలతో కల్తీ మద్యం అంటూ.. మద్యం మరణాలు అంటూ తప్పుడు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. కాగా, రాష్ట్రంలో కల్తీ మద్యం వ్యవహారం కలకలం రేపగా.. కల్తీ మద్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న టీడీపీ నేతలకు భారీ షాక్ తగిలింది.. జయచంద్రా రెడ్డి, సురేశ్ నాయుడులను టీడీపీ నుంచి సస్పెండ్ చేసిన విషయం విదితమే.. ఇక, అన్నమయ్య జిల్లా మొలకల చెరువు నకిలీ మద్యం వ్యవహారంలో నిందితులపై కఠిన చర్యలకు గతంలోనే సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. నిస్పక్షపాతంగా దర్యాప్తు జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని.. రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని ఉపేక్షించే ప్రసక్తే లేదని సీఎం తేల్చి చెప్పారు. ప్రజల ప్రాణాలకు హాని చేసే నకిలీ మద్యం విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు..

# నేడు నోటిఫికేషన్

(మొదటి పేజీ తరువాయి)

నోటిఫికేషన్ పక్రియ మాత్రం ఆటంకం లేకుండా ముందుకు సాగనుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై దాఖలైన పిటిషన్లను తెలంగాణ హైకోర్టు ఈరోజు విచారించింది. విచారణ సందర్భంగా సుదీర్ఘ వాదనలు జరిగినప్పటికీ, తదుపరి విచారణను నేటి మధ్యాహ్నం 2.15 గంటలకు వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు ప్రకటించింది. దీంతోమరిన్ని వాదనలు వినిపిస్తామని అడ్వకేట్ జనరల్ కోర్టుకు తెలిపారు. అయితే, రేపటి నోటిఫికేషన్ ఇవ్వకుండా చూడాలంటూ పిటిషనర్ తరపు న్యాయవాదులు చేసిన వాదనలను హైకోర్టు పరిగణలోకి తీసుకోలేదు. హైకోర్టులో బీసీ రిజర్వేషన్లపై విచారణ రేపటికి వాయిదా పడిన వెంటనే, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డితో రాష్ట్ర మంత్రులతోపాటు మరికొందరు ముఖ్య నాయకులు సమావేశమయ్యారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, కొండా సురేఖ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్ సహా ఇతర ముఖ్య నేతలు ఈ భేటీలో పాల్గొన్నారు. హైకోర్టులో జరిగిన సుదీర్ఘ వాదనల తీరుపై చర్చించి, రేపు హైకోర్టులో అనుసరించాల్సిన అంశాలపై అడ్వకేట్ జనరల్‌తో మంత్రులు మంతనాలు జరిపారు. నేడు విడుదల కానున్న నోటిఫికేషన్ తెలంగాణలోని 31 జిల్లాల్లోని 565 మండలాలకు సంబంధించిన స్థానిక సంస్థల ఎన్నికలకు వర్తిస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 5,749 ఎంపీటీసీలు, 565 జడ్పీటీసీలు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికల కమిషన్ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను రెండు విడతల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. రేపు ఆయా జిల్లాల్లోని జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారులు స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నారు. మొదటి విడతలో ఎంపీటీసీ, జడ్పీటీసీకు ఎన్నికలు జరగనున్నాయి. ఫస్ట్ ఫేస్?లో 2,963 ఎంపీటీసీ స్థానాలకు, 292 జడ్పీటీసీ స్థానాలకు నోటిఫికేషన్ రిలీజ్ కానుంది. ఇందుకు గాను అక్టోబర్ 9వ తేదీ నుంచి నామినేషన్లు దాఖలు చేయొచ్చు. వీటికి అక్టోబర్ 11వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. మొదటి విడత జరిగే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు అక్టోబర్ 23వ తేదీన పోలింగ్ జరగనుంది. ఓట్ల లెక్కింపు నవంబర్ 11న జరగనుంది.

# నేడు అనకాపల్లిలో జగన్ పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

10.15 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి 11 గంటలకు విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారు.. 11.30 గంటలకు విశాఖ ఎయిర్ పోర్టు నుంచి బయలుదేరుతారు.. 2 గంటలకు అనకాపల్లి జిల్లా మాకవరపాలెం చేరుకుంటారు.. అక్కడ నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలను పరిశీలిస్తారు.. మధ్యాహ్నం 2.45 తిరిగి అక్కడ నుంచి బయలుదేరుతారు.. 04.15 గంటలకు విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారు.. 04.45 గంటలకు అక్కడ నుంచి బయలుదేరి 6 గంటలకు బెంగుళూరుకు చేరుకుంటారు.. జగన్ మోహన్ రెడ్డి నర్సీపట్నం పర్యటనకు షరతులతో కూడిన అనుమతి లభించింది. రూట్ మార్చి..18 కండీషన్లతో పోలీసులు అనుమతి ఇచ్చారు. పోలీసులు ప్రతిపాదించిన మార్గంలోనే జగన్ పర్యటన నిర్వహించేందుకు వైసీపీ నాయకత్వం అంగీకరించింది. ఈ అంశంపై మాజీ మంత్రి అమర్నాథ్ మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి పర్యటనకు ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందన్నారు. స్టీల్ ప్లాంట్ కార్మికులను జగన్మోహన్ రెడ్డి కలవకుండా చూసేందుకు పోలీసులు రూట్ మార్చారు. భద్రత, టూర్ ఏర్పాట్లపై పోలీసులకు అనేక సార్లు విజ్ఞప్తి చేశాం. ఎయిర్ పోర్టు నుంచి మేం ప్రతిపాదించిన మార్గం కాకుండా ప్రత్యామ్నాయం మార్గంలో అనుమతి ఇస్తున్నట్టు చెప్పారు. జగన్మోహన్ రెడ్డి పర్యటన పర్మిషన్ ఎలా రావాలో.. ఎప్పుడు రావాలో మిమ్మల్ని మేం అడగలేదు. పోలీసులు తాజాగా ఇచ్చిన రూట్ మ్యాప్ ఆధారంగానే పర్యటన కొనసాగుతుంది.. స్టీల్ ఎ÷-లాంట్ కార్మికులు, నిర్వాసితులు మార్గ మధ్యలో జగన్మోహన్ రెడ్డిని కలవచ్చు.. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, బల్క్ డ్రగ్ పార్క్ సహా అన్ని సమస్యలపైన మా స్టాండ్ క్లియర్ గా ఉందని పేర్కొన్నారు.

# రసాయనశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

(మొదటి పేజీ తరువాయి)

వీరు కొత్తరకం మాలిక్యూలర్ ఆర్కిటెక్చర్‌ను అభివృద్ధి చేసినట్టు తెలిపింది. గతేడాది కూడా ముగ్గురికి ఈ అవార్డు దక్కింది. ప్రోటీన్లపై విశేష పరిశోధనలు చేసిన డేవిడ్ బేకర్, డెమిస్ హసాబిస్, జాన్ జంపర్‌లు ఈ పురస్కారం అందుకున్నారు. మొత్తంగా 1901-2024 మధ్యకాలంలో 116 సార్లు రసాయన శాస్త్రంలో నోబెల్‌ను ప్రకటించగా ఇప్పటివరకు 195 మంది దీనిని అందుకున్నారు.వీరిలో జాన్ బీ గూడ్‌ఎనఫ్ 97 ఏండ్ల వయసులో కెమిస్ట్రీలో పురస్కారం అందుకున్న వృద్ధుడిగా నిలువగా.. ఫ్రెడెరిక్ జొలియట్ 35ఏండ్ల వయసులో నోబెల్ అందుకున్న అతిపిన్న వయస్కుడిగా నిలిచారు. ఇక ఫ్రెడరిక్ సాంగెర్, బ్యారీ షార్ప్‌లెస్‌లు రసాయన శాస్త్రంలో రెండుసార్లు నోబెల్ అందుకోవడం విశేషం. మరోవైపు సోమవారం (ఈనెల 6న) మొదలైన నోబెల్ పురస్కారాల ప్రకటన అక్టోబర్ 13 వరకు కొనసాగనుంది. తొలుత వైద్యశాస్త్రంలో, మంగళవారం భౌతికశాస్త్రంలో విజేతలను ప్రకటించారు. బుధవారం రసాయనశాస్త్రంలో నోబెల్ గ్రహీతల పేర్లు వెల్లడించారు. గురువారం సాహిత్యం, శుక్రవారం శాంతి బహుమతి, 13న అర్థశాస్త్రంలో ఈ పురస్కారం అందుకోనున్న వారి పేర్లను ప్రకటించనున్నారు. ఆల్‌ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి రోజైన డిసెంబర్ 10న విజేతలకు అవార్డులను అందజేస్తారు.

## నేడు సొంత నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ పర్యటన...

# మత్స్యకారుల కోసం సముద్రంలో ప్రయాణం

(మొదటి పేజీ తరువాయి)

పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఉప్పాడ ప్రాంత మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. ముఖ్యంగా, సముద్ర జలాలు కలుషితమవుతున్నాయని వారు చేస్తున్న ఫిర్యాదులను స్వయంగా పరిశీలించేందుకు ఆయన సముద్రంలోకి వెళ్లనుండడం ప్రాధాన్యత సంతరించుకుంది.వివరాల్లోకి వెళితే, ఉప్పాడ ప్రాంత మత్స్యకారులు చాలా కాలంగా సముద్ర కాలుష్యం వల్ల జీవనోపాధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్య తీవ్రతను ప్రత్యక్షంగా తెలుసుకోవాలని నిర్ణయించుకున్న పవన్ కల్యాణ్, అధికారులతో కలిసి పడవలో సముద్రంలో ప్రయాణించి కాలుష్య ప్రభావిత ప్రాంతాలను పరిశీలించనున్నారు. ఈ పర్యటన ద్వారా మత్స్యకారుల వాదనల్లోని వాస్తవాలను గ్రహించి, తగిన చర్యలు చేపట్టాలని ఆయన భావిస్తున్నారు.సముద్ర పర్యటన అనంతరం, పవన్ కల్యాణ్ ఉప్పాడలో మత్స్యకారులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. వారి సమస్యలను విని, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇవ్వనున్నారు. ఇదే పర్యటనలో భాగంగా పిఠాపురం నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన కూడా చేయనున్నారు.

# బాణాసంచా తయారీ కేంద్రంలో పేలుడు

(మొదటి పేజీ తరువాయి)

మిగిలిన వారిని ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. పేలుడు సంభవించడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. మంటల్లో చిక్కుకుని ఆరుగురు సజీవ దహనమయ్యారు. మృతుల్లో నలుగురు మహిళలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. బాణసంచా పరిశ్రమ యజమాని సత్తిబాబు కూడా ఉన్నట్లు సమాచారం. సమాచరం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో 40 మంది కార్మికులు అందులో పనిచేస్తున్నారు. భారీ పేలుడు ధాటికి బాణసంచా తయారీ కేంద్రం షెడ్డు గోడ కూలింది. శిథిలాల కింద మరికొందరు ఉండొచ్చని సమాచారం. ఘటనాస్థలిని రామచంద్రపురం ఆర్డీవో అఖిల పరిశీలించారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ మహేశ్‌కుమార్ స్పందించారు. వారం క్రితమే బాణసంచా తయారీ కేంద్రాన్ని స్థానిక పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పరిశీలించి అన్ని రక్షణ చర్యలు ఉన్నట్లు నివేదిక ఇచ్చినట్లు తెలిపారు. అగ్నిప్రమాద నివారణ పరికరాలను గోదాము యజమానులు సక్రమంగా వినియోగించారా? లేదా? అనే విషయాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకుంటు న్నామన్నారు. బాణసంచా పేలుడు ఘటనపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దీనిపై అధికారులతో ఆయన మాట్లాడారు. ప్రమాదంలో పలువురు చనిపోవడంపై సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలు, ప్రస్తుత పరిస్థితి, సహాయకచర్యలు, వైద్యసాయంపై వివరాలను అధికారుల నుంచి ఆయన తెలుసుకున్నారు. ఘటనాస్థలికి వెళ్లి సహాయకచర్యల్లో పాల్గొనాలని చంద్రబాబు ఆదేశించారు. మరోవైపు ఈ ఘటనపై హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీ, అగ్నిమాపక శాఖ అధికారులతో ఆమె మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని మంత్రి తెలిపారు.

# స్థానిక ఎన్నికలపై స్టే ఇవ్వని హైకోర్టు

**హైదరాబాద్ అక్టోబర్ 8 ఆంధ్ర ప్రగతి :**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 9ని కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూడుచింతలపల్లి మండలం కేశవాపూర్ గ్రామానికి చెందిన బుట్టెంగారి మాధవరెడ్డితో పాటు మరికొందరు పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే.

బీసీ రిజర్వేషన్లకు అనుకూలంగా తమ వాదనలు కూడా వినాలంటూ కాంగ్రెస్, సీపీఐ సహా మరి కొందరు బీసీ నాయకులు 30 ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేశారు. వీటన్నింటిపై చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మోహియుద్దీన్ డివిజన్ బెంచ్ బుధవారం సుదీర్ఘంగా విచారణ జరిపింది. తొలుత పలువురు లాయర్లు ఒకేసారి వాదనలకు సిద్ధమవడంతో హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. బీసీ రిజర్వేషన్లు సీరియస్ అంశమనీ, తమ సహనాన్ని పరీక్షించొద్దని హితవు చెప్పింది.

**రిజర్వేషన్లు 50 శాతం మించొద్దు**

తర్వాత పిటిషనర్ల తరఫున సీనియర్ లాయర్లు కే వివేక్‌రెడ్డి, బీ మయూర్‌రెడ్డి, జె ప్రభాకర్ తదితరులు వాదనలు ప్రారంభించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదన్నారు. బీసీ రిజర్వేషన్లను 25 శాతం నుంచి 42 శాతానికి పెంపు చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. డెడికేటెడ్ కమిషన్ చేసిన సిఫార్సులకు అనుగుణంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చట్ట వ్యతిరేకమన్నారు. అశాస్త్రీయ గణాంకాలతో 50 శాతం దాటిన రిజర్వేషన్ల నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరారు. రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీం కోర్టు మూడు వేర్వేరు కీలక కేసుల్లో వెలువరించిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని సుప్రీం కోర్టు చెప్పిందన్నారు. ఇందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం చట్టం కూడా చేసిందన్నారు.

# విలువలతో కూడిన విద్య విద్యార్థులకు అవసరం.

## కేంద్రీయ విద్యాలయంలో సీటు వచ్చిందంటే అదృష్టవంతులు.

## విద్యకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద పీఠ.-నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా అక్టోబర్ 08:**
నేటి తరం విద్యార్థులకు భారతీయ సంస్కృతీ, సంప్రదాయ విలువలతో కూడిన విద్య ఎంతో అవసరం అని, కేంద్రీయ విద్యాలయంలో చదువుకునేందుకు సీటు వచ్చిందంటే వారి పిల్లలు అదృష్ట వంతులని, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన నిధులు కూడా అందిస్తుందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.
బుధవారం నంద్యాల జిల్లా డోన్ పట్టణంలో నూతన కేంద్రీయ విద్యాలయ తరగతులను ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులను ఉద్దేశించి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యపట్ల ప్రత్యేక దృష్టి పెట్టి ముందుకు తీసుకెళ్లుతున్నారని, కేంద్ర ప్రభుత్వం ద్వారా విద్యకు అధిక నిధులు రాబట్టేందుకు కృషి చేస్తున్నారని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వివరించారు.
ఎక్కడ సమస్య ఉన్నా అక్కడికి ప్రిన్సిపాల్ ను బదిలీ చేసి ఆ మంచి కార్యక్రమం పూర్తి చేసేలా ప్రభుత్వం బాధ్యత అప్పగిస్తుందని, మూడు సమస్యలు తొలగించి నాల్గవ బాధ్యత డోన్ కేంద్రీయ విద్యాలయం అప్పగించడంతో ఎన్నో సమస్యలు ఉన్నా తక్కువ సమయంలో వాటిని



పూర్తి చేసి నేడు డోన్ పట్టణంలో కేంద్రీయ విద్యాలయం తరగతులు ప్రారంభం కావడానికి శ్రమించిన ప్రిన్సిపాల్ ఎం. మాలిక్ ను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని ఎంపీ డాక్టర్ బైరెడ్డి అనడంతో హర్షధ్వనాలు మోగాయి.
ఎవరో తెచ్చింది కాదని, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎక్కువగా ఉన్న చోట, ప్రతి జిల్లా కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేస్తుందని, అందులో భాగంగానే నంద్యాలలో ఏర్పాటు చేయాల్సిన ఈ విద్యాలయం డోన్ లో ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లా కేంద్రం నంద్యాలలో కూడా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు అధికంగా ఉండడంతో మరో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని తాను కేంద్ర ప్రభుత్వంను కోరగా మంజూరుకు అంగీకారం తెలిపినట్లు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు.
కేంద్రీయ విద్యాలయంలో చదువుకునేందుకు చాలా పోటీ ఉందని, ఇక్కడ సీటు వచ్చిందంటే మీ పిల్లలు ఎంతో అదృష్టవంతులని, వారు ఇక సెటిల్ అయినట్లేనని, తల్లిదండ్రులు నిచ్చింతగా ఉండొచ్చాన్నారు. దేశ వ్యాప్తంగా ఒకే సిలబస్ తో ఇక్కడ విద్య అందుతుందని, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు బదిలీ అయ్యేప్పుడు విద్యార్థుల చదువులకు ఎలాంటి ఆటంకం కలుగకుండా ఒకే సిలబస్ తో కేంద్రీయ విద్యాలయంలో విద్యాబోధన ఉంటుందనీ, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు మొదటి ప్రాధాన్యత ఇక్కడ ఉంటుందన్నారు. హిందీ చదవడం, వ్రాయడం నేర్చుకున్న విద్యార్థులు దేశంలో ఎక్కడైనా రాణించగలరని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.
తాను పార్లమెంటరీ విద్యా సలహా కమిటీ సభ్యురాలుగా ఉన్నానని, ఈ అవకాశం ఉపయోగించుకొని రాష్ట్రానికి, నంద్యాల జిల్లాకు కేంద్ర ప్రభుత్వం ద్వారా విద్యకు ఎక్కువ నిధులు రాబట్టేందుకు కృషి చేస్తానన్నారు.
డోన్ కేంద్రీయ విద్యాలయంలో చదువుకునే విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని, ఏ అవసరం వచ్చిన తనకు ఫోన్ ద్వారా కలిసి సమస్య పరిష్కారించుకోవాలని, విద్యార్థులందరూ ఉన్నత శిఖరాలు అవరోధించాలని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి విద్యార్థులను దీవించారు. ఈ కార్యక్రమంలో డోన్ ఆర్ డి ఓ కె. పి. నరసింహులు, డోన్ అర్బన్ సి ఐ ఇర్ఫాన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# స్వర్గధామం పూల మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఫరూక్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ అక్టోబర్ 08:**
నంద్యాల పట్టణ శివారులోని భీమవరం రస్తాలో ఉన్న స్వర్గధామం నందు 1000 పూల మొక్కలు నాటే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పాల్గొని మొక్కలు నాటారు అలాగే పోయిన సంవత్సరం దసరాకి మంత్రి ఫరూక్ చేతుల మీదుగా నాటిన నాలుగువేల పూల మొక్కలు ఈరోజు ఒక అందమైన బృందావనంగా తీర్చిదిద్దబడ్డాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ దుర్భరమైన పరిస్థితుల్లో పబ్లిక్ టాయిలెట్స్ గా వాడుకునే స్మశానవాటికలను నవనిర్మాణ సమితి ఒక ఆహ్లాదకరమైన పరిశుభ్రమైన



స్మశాన వాటికలుగా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. ఈ స్వర్గధామం రాయలసీమలోనే కాకుండా తెలంగాణ రాష్ట్రంలో వనపర్తి జడ్చర్ల పట్టణాల నుంచి కూడా వచ్చి స్వర్గధామాన్ని ఏ విధంగా నిర్వహించేది తెలుసుకొని పోవడం నంద్యాల స్వర్గధామం యొక్క కృషిని అభినందించదగ్గ విషయం అన్నారు. అంతేకాకుండా ఇందులో పనిచేస్తున్న స్వర్గధామం సేవకులు కూడా ఎవరిని ఇబ్బంది పెట్టకుండా అన్ని సేవలు అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. స్వర్గ ధామం అధ్యక్షులుగా డాక్టర్ మధుసూదన్ రావు మాట్లాడుతూ



ఇంకా కొన్ని వసతులు ఈ స్వర్గధామం లో చేయవలసిన అవసరం ఉంది దానికోసం ఆర్థిక వనరుల అవసరం ఉందని చెప్పడం జరిగింది. ఇంకొక వెకుంఠ ఒక వైకుంఠ రథం ఇంకా కావలసిన అవసరముంది. అలాగే నంద్యాల చుట్టుపక్కన గ్రామాలకు కూడా స్వర్గధామం సేవలను ఇవ్వడానికి మేము రెడీగా ఉన్నాము అని చెప్పడం జరిగింది. అనంతరం మంత్రి ఫరూక్ చేతుల మీదుగా స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రామచంద్రరావు , నెరవాటి సత్యనారాయణ , ఒకటో వార్డు కౌన్సిలర్ నాగార్జున , పబ్బతి వేణు , గెలివి రామకృష్ణ, సి. రాజశేఖర్, కొమ్మ హరి, సముద్రాల పాండురంగయ్య, బొగ్గరపు సత్యనారాయణ, బాబురావు, చిత్తలూరు రాంప్రసాద్, నెరవాటి మధు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొనడం జరిగింది.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కమిటీలో ఆర్ఎంపీ ల హవా..!

## ....టీడీపీ సభ్యులకు మొండి చెయ్యి.వైసిపి నాయకుల కు దక్కిన చోటు.

## ...ఆర్ఎంపీ లకే మద్దతు ఇచ్చిన కొందరు వైద్యులు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 08:**
రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా తెలుగుదేశం సభ్యులకు మొండి చెయ్యే మిగులుతుంది. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కమిటీలో ఆర్ ఎంపీ ల హవా నడిచింది. కొందరు వైద్యులు సైతం అర్ ఎం పి లకు మద్దతు ఇవ్వడంతో వారిదే హవా నడిచింది. తెలుగుదేశం పార్టీని నమ్ముకున్న కొందరు సభ్యులను కమిటీలో గతంలో ఉన్నవారిని ఎన్నుకోకుండా వైసిపి కి చెందిన కొందరిని కమిటీలో ఎన్నుకోవడంతో పార్టీని నమ్ముకున్నారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలు ప్రశంసనీయం. ఎందరో ప్రాణాలు నిలబెట్టడంతో ప్రజల్లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ లో సభ్యులుగా ఉంటే ఆ గౌరవం అంతా ఇంతా కాదు. సొసైటీకి ఎందరో సహాయ సహకారాలు అందిస్తూ అందరితో ప్రశంసలు పొందుతున్నారు. గత కమిటీలో తెలుగుదేశం పార్టీకి చెందిన కొందరు ఎన్నో సేవలు చేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యవర్గం లో ఆర్ ఎం పి లదే హవా కొనసాగినట్టు తెలుస్తోంది. సేవలు చేస్తున్న వారికి ఎవరికి ఇచ్చినా సమస్య లేదు కానీ సొంత డబ్బు ఖర్చుపెట్టి సేవలు అందిస్తున్న వారికి కమిటీలో స్థలం లేకుండా,వైసిపి కి చెందిన కొందరిని కమిటీలో ఎన్నుకోవడం దుమారం రేగుతుంది. పట్టణానికి చెందిన కొందరు వైద్యులు సైతం అర్ ఎం పి లకు మద్దతు ఇవ్వడం విశేషం. అర్ ఎం పి లు కొందరు ప్రవేటు ఆసుపత్రులకు రోగులను పంపిస్తుండడంతో వారికి మద్దతు ఇచ్చినట్టు తెలుస్తోంది. మరో వైపు తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నా తెలుగుదేశం పార్టీని నమ్ముకున్న వారికి కమిటీలో స్థానం లేకుండా వైసిపి కి చెందిన వారికి చోటు కల్పించడం ఏమిటి అని కొందరు ప్రశ్నిస్తున్నారు. సభ్యత్వం లేకపోయినా కొందరికి సభ్యులుగా పదవులు కట్టబెట్టారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు ఇప్పటికైనా కమిటీ లో అన్యాయం జరిగిన వారికి న్యాయం చేస్తారని ఆశిద్దాం.

## ప్రధాని మోదీ శ్రీశైలం పర్యటనను

# విజయవంతం చేయండి.

## జనసేన రాష్ట్ర నాయకులు భవనాసి వాసు పిలుపు.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబరు 08:**
శ్రీశైలంలోని పవిత్ర క్షేత్ర వాతావరణంలో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అడుగు పెట్టనున్న వేళ జనసేన నాయకులు, నిత్య అన్నదాన దాత భవనాసి (శ్రీనివాసు) వాసు, నాగి వెంకటేశ్వర్లు ప్రజలతో కలిసి పర్యటనను ఘనవిజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 16న జరగనున్న ప్రధానమంత్రి యాత్రకు సంబంధించి వారు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భవనాసి వాసు మాట్లాడుతూ"శ్రీశైలం భారతీయ ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీక. అటువంటి స్థలానికి ప్రధానమంత్రి రాక తెలుగు ప్రజలకు గర్వకారణం. దేశాన్ని అభివృద్ధి ప్రస్థానంలో ముందుకు నడిపిస్తున్న నరేంద్ర మోదీ ఈ యాత్ర చారిత్రాత్మకంగా నిలవాలని ఆకాంక్షిస్తున్నాం" అన్నారు. నాగి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ "భారతీయ సంస్కృతిలో ఆధ్యాత్మికత ఉజ్వలమైన మార్గదర్శకం. అటువంటి విలువలను పరిరక్షిస్తున్న ప్రధాని శ్రీశైలాన్ని దర్శించుకోవడం ప్రజల జీవితాల్లో స్ఫూర్తి నింపుతుంది. ఈ పర్యటన విశ్వాసానికి, అభివృద్ధికి, ఏకతకు చిహ్నంగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు. ప్రధాని రాక సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు, భక్తులు సమన్వయంగా పనిచేసి కార్యక్రమం విజయవంతం చేయాలని ఇద్దరూ కోరారు. దేశవ్యాప్తంగా శ్రీశైలం క్షేత్రానికి మరో గుర్తింపు ఇవ్వనున్న ఈ పర్యటనలో ప్రతి తెలుగు భక్తుడూ పాల్గొని గౌరవించాలన్నారు. భవనాసి వాసు, నాగి వెంకటేశ్వర్లు నేతృత్వంలో స్థానిక జనసేన కార్యకర్తలు పర్యటన ఏర్పాట్లకు తమ వంతు సహకారం అందించేందుకు సిద్ధమయ్యారు.

# సూపర్ జీఎస్టీపై అవగాహన కార్యక్రమం.





**ఆంధ్ర ప్రగతి మహానంది అక్టోబర్ 08:**
రాష్ట్ర ప్రభుత్వం తగ్గించిన సూపర్ జీఎస్టి సూపర్ సేవింగ్స్ పై ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని కేసీ కెనాల్ ప్రాజెక్టు చైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మహానంది మండలం ఆర్ఎస్ గాజులపల్లె గ్రామంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ కార్యక్రమం సర్పంచ్ షేక్ అస్లాం భాష ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ఇంటింటికి కరపత్రాలను పంపించేశారు. ఆయన మాట్లాడుతూ..సూపర్ సిక్స్' పథకాల మాదిరిగానే ఈ 'సూపర్ జీఎస్టీ' కూడా ప్రజలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, నిత్యవసర సరుకులపై కూటమి ప్రభుత్వం జీఎస్టీని తగ్గించి ప్రజలపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ట్రాక్టర్లు, విడిభాగాలకు, పంట రక్షణ, పోషణకు సంబంధించిన ఉపకరణాలకు, అత్యాధునిక వ్యవసాయ పరికరాలకు జీఎస్టీ భారీగా తగ్గింపు చేసినందున సాగు ఖర్చు తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని, టీడీపీ మండల కన్వీనర్ కంచర్ల శివయ్య, జనసేన మండల అధ్యక్షుడు మారెడ్డి రామయ్య, జనసేన నాయకులు నల్లబోతుల మల్లికార్జున, టిడిపి నాయకులు పాశం శ్రీనివాసులు, పాశం రమణ, ఆత్మకూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ లాలమ్మ, జనసేన నాయకులు బోనాసి ప్రసాద్, చిన్న కుళాయి, రాజశేఖర్ నాయక్, పొదుపు మహిళలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు.

## మానవత్వం చాటుకున్న ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి.







**ఆంధ్ర ప్రగతి మహానంది అక్టోబర్ 08:**రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను మహానంది ఎస్ఐ ఎన్ .రామ్మోహన్ రెడ్డి తన వాహనంలో ఆసుపత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు. బుధవారం మహానంది మండలం బుక్కాపురం గ్రామ పరిధిలోని మలుపు వద్ద ఆటో- కారు ఢీకొన్నాయి. తిమ్మాపురం నుండి నంద్యాలకు ప్రయాణికులు, ఉపాధ్యాయులను ఎక్కించుకొని వెళ్తున్న ఆటోను, వేగంగా వస్తున్న కారు మరొక కారుని ఓవర్టేక్ చేయబోయి అదుపుతప్పి ఆటోను వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో బోల్తాపడడంతో ఉపాధ్యాయులు రాఘవేంద్రమ్మ, ఉమామహేశ్వరమ్మ, జయరాముడు, ఆటోడ్రైవర్ బాలస్వామిలకు గాయాలయ్యాయి. అదే సమయంలో అటుగా వెళుతున్న ఎస్సై, సిబ్బంది మురళి గాయలతో ఉన్న వారిని చూశారు. వెంటనే ఎస్సై, సిబ్బంది, ప్రజలు ఆటోను పైకి లేపారు. ఎస్సై తన వాహనంలో చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై విచారణ చేపడుతున్నామని మహానంది ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. మానవత్వంతో స్పందించి దగ్గరుండి ఆసుపత్రికి తరలించిన ఎస్సై, పోలీస్ సిబ్బందిని ప్రజలు అభినందించారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక


# ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది.!

**విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దండి. - బెస్ట్ టీచర్స్ అవార్డులను ప్రధానం చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.**












**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 08:**

ఆంధ్రప్రదేశ్ ప్రవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (అపుస్మా) వారి ఆధ్వర్యంలో స్థానిక ఆర్కే ఫంక్షన్ హాల్ నందు నిర్వహించిన అపుస్మా బెస్ట్ టీచర్స్ అవార్డు ఫంక్షన్ కు ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, అపుస్మా చైర్మన్ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి అపుస్మా నంద్యాల జిల్లా అధ్యక్షులు బిజ్జం సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉపాధ్యాయులకు మాత్రమే ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులను ప్రదానం చేస్తుందని దాన్ని ఆధారంగా తీసుకొని ప్రవేట్ స్కూల్లో మంచి బోధన చేసే వారిని కూడా ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించాలని ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (అపుస్మా) వారు నిర్వహించిన, ఈ అవార్డు కార్యక్రమం మంచి శుభపరిణామం అని అన్నారు. ఉపాధ్యాయులు దేశ భవిష్యత్తుకు మార్గదర్శకాలని, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు పొందిన వారికి అభినందనలు తెలియజేశారు. వినూత్న బోధనా పద్ధతులలో, విద్యార్థుల వృద్ధికి అంకితభావం, క్లిష్ట పరిస్థితుల్లోనూ అభ్యాస విజయాలను పెంపొందడంలో , స్ఫూర్తిదాయకమైన బోధన వంటి విషయాల్లో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి అపుస్మా వారి బెస్ట్ టీచర్స్ అవార్డుల ప్రదానోత్సవంలో గుర్తింపు దక్కిందన్నారు. ఉపాధ్యాయులకు ఏదైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకొని రావాలని వాటిని కచ్చితంగా పరిష్కరిస్తానని తెలియజేశారు. అనంతరం అపుస్మా బెస్ట్ టీచర్స్ అవార్డు లోగోను ఆవిష్కరించారు. అలాగే బెస్ట్ టీచర్స్ అవార్డు పొందిన వారిని మేమేంటోతో సన్మానించారు.




ఈ కార్యక్రమంలో అపుస్మా స్టేట్ ప్రెసిడెంట్ తులసి విష్ణు ప్రసాద్ , స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమణారెడ్డి, నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, అపుస్మా స్టేట్ వైస్ ప్రెసిడెంట్ %డ% శాంతినికేతన్ స్కూల్స్ అధినేత సుధాకర్, రామకృష్ణ విద్య సంస్థల అధినేత డాక్టర్ జి రామకృష్ణారెడ్డి, గురు రాఘవేంద్ర విద్యాసంస్థల అధినేత దస్తగిరి రెడ్డి, రావుస్ విద్యాసంస్థల అధినేత అప్పారావు, కేశవరెడ్డి విద్యా సంస్థల అధినేత నాగిరెడ్డి కేశవరెడ్డి , వెంకటస్వామి, వికాస్ వలి, ఇషాక్ వలి, హుస్సేన్ భాష, ఉత్తేజ్ కుమార్, హుస్సేన్ వలి, మోహిన్ మరియు భారీ సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





## రోడ్ సేఫ్టీ పై అవగాహన కార్యక్రమం.






**ఆంధ్ర ప్రగతి ఆత్మకూరు క్రైమ్ అక్టోబర్ 08:**రోడ్డు ప్రమాదాల నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని స్కూల్లు మరియు కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్న నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఆదేశాలమేరకు నేడు ఆత్మకూరు డిఎస్పి రామాంజనేయ ఆధ్వర్యంలో ఆత్మకూరు టౌన్ లోని తెరిసా జూనియర్ కళాశాల నందు "రోడ్డు భద్రత పై అవగాహన" కార్యక్రమం నిర్వహించడమైనది. ఈ సందర్భంగా డిఎస్పి రామంజి నాయక్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు మరియు సురక్షిత రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించాలని ముఖ్యంగా హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ ల ప్రాధాన్యతపై సులువుగా అర్థం చేసుకునేందుకు ఉదాహరణలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మరియు పాదాచారుల భద్రత మరియు వారు సురక్షిత%శీ%గా రోడ్డు దాటడం గురించిన వివరాలపై అవగాహన కల్పిస్తూ, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ.. డ్రైవింగ్ చేస్తే జరిగే ప్రమాదాల గురించి , మైనర్ డ్రైవింగ్ రాష్ డ్రైవింగ్ చేయరాదని విద్యార్థులకు తెలియజేయడమైనది. ఈ కార్యక్రమంలో డిఎస్పీతో పాటు ఇన్స్పెక్టర్లు రాము, సురేష్ కుమార్ రెడ్డి మరియు తెరిసా కళాశాల ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# టపాకాయల దుకాణం కావాలా.. అయితే కప్పం ఇచ్చుకో..!

**... సింగిల్ విండో వ్యవస్థ అని అధికారులు చెపుతున్నారు.**

**...ఆ నాయకులు మాత్రం కప్పం కడితేనే దుకాణాలు కేటాయిస్తారా.?**

**...ప్రతిఏటా టపాకాయల దుకాణాలు ఏర్పాటు లొల్లి.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 08:**

నంద్యాలలో టపాకాయల దుకాణం ఏర్పాటుచేయాలంటే ఆ నాయకులకు కప్పం కట్టాల్సిందేనా అని కొందరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులు జరిగే వ్యాపారం కు ప్రతిఏటా లొల్లి నడవడం షరా మామూలే అన్న చందంగా మారిపోతుంది. టపాకాయల దుకాణం కావాలా నాయనా...కప్పం 48 వేలు ఇస్తేనే దుకాణం కేటాయిస్తాం అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం అధికారంలో ఎవరు ఉంటే ఆ పార్టీకి చెందిన ద్వితీయ స్థాయి నాయకుల హవా కొనసాగుతుంది. ఈ ఏడాది కొందరు టపాకాయల దుకాణం యజమానులకు కప్పం సమాచారం ఇచ్చినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు మాత్రం ఒక వైపు వ్యాపారులు ఇబ్బందులు పడకుండా సింగిల్ విండో వ్యవస్థ వల్ల వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా చేస్తున్నామని ఒక ప్రక్క చెపుతున్నా, కొందరు దళారులు వ్యాపారస్తులకు కప్పం కట్టనిదే దుకాణాలు రావు అని తెగేసి చెప్పడంతో కొందరు వ్యాపారులు ,కప్పం కట్టి వ్యాపారాలు చేసుకుంటే సైలెంట్ గా ఉంటే మేలు అని చెప్పుకొస్తున్నా, ప్రతి ఏటా వ్యాపారులు ఇలా చెప్పడం అలా కప్పం కట్టడం, దుకాణాలు చేజిక్కించుకొని రూపాయి విలువచేసే టపాకాయలు అధికాధారాలు పెట్టి ప్రజలను దోచుకోవడం రివాజుగా మారింది. వివరాల్లోకి వెళితే దీపావళి పండుగ సందర్భంగా టపాకాయల దుకాణాలు వెలుస్తాయి. టపాకాయల దుకాణాలు ఏర్పాటుచేసుకోవాలంటే తప్పనిసరిగా దుకాణం లైసెన్స్ తో పాటు ఫైర్, పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, సేల్ టాక్స్, తూనికలు కొలతలు శాఖలకు చెందిన అధికారుల అనుమతులు ఇవ్వాల్సింది. టపాకాయల దుకాణాలు కేటాయించే ప్రక్రియ పండుగకు కొద్ది రోజుల ముందు ఇవ్వడంతో అనుమతులు కు తిరిగే సమయం తక్కువ ఉండడంతో అన్ని అనుమతులు ఒకరే ఇప్పించే విధంగా కొందరు ద్వితీయ స్థాయి నాయకులు భుజం పై వేసుకొని ఒకొక్క దుకాణం దారుడు నుంచి కప్పం ఒకరేటు ఫిక్స్ చేసేవారు. గతంలో ఒకొక్క దుకాణం కు అన్ని అనుమతులు ఇప్పించడానికి 30 వేలు మొదలు పెట్టి గత సంవత్సరం 42 వేలు కప్పం చెల్లించి దుకాణాలు ఏర్పాటుచేసుకున్న విషయం విదితమే. అక్కడ కూడా ఆ నాయకులు చేతి వాటం ప్రదర్శిస్తూ కొన్నిటికి మాత్రమే అధికారులకు డబ్బులు కట్టారని తెలుస్తోంది. దుకాణాల సంఖ్య, ప్రభుత్వానికి కట్టిన సంఖ్యలో చాలా తేడాలు ఉన్నట్టు ప్రచార మాధ్యమాల్లో వచ్చిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా అన్ని శాఖలకు చెందిన అనుమతులు ఒకే చోటా ఉండే విధంగా అధికారులు సింగిల్ విండో విధానాన్ని రూపొందించడంతో వ్యాపారులు సంతోషించిన రెండురోజుల్లో గాలి తీసిన బెలూన్ లా మారిపోయినట్టు సమాచారం. టపాకాయల దుకాణం కావాలంటే తప్పని సరిగా ఒకొక్కరు 48 వేలు కప్పం కడితేనే దుకాణాలు కేటాయిస్తామని చెప్పినట్టు సమాచారం. ప్రచారసాధనల్లో ఎన్ని రాసుకున్నా మాకు ఏమి కాదు మాకు కప్పం కట్టాల్సిందే అని కొందరు ద్వితీయ స్థాయి నాయకులు హుకుం జారీచేసినట్టు తెలుస్తోంది. ద్వితీయ స్థాయి నాయకులకు కప్పం కట్టి తీసుకుంటారో లేదో వేచి చూద్దాం. వ్యాపారులు కప్పం కట్టి తీసుకుంటే టపాకాయల ధరలు మతాబుల్లా వెలిగిపోవడం తప్పదని మేధావులు పేర్కొంటున్నారు.

# సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ పై దాడి చేయడం అంటే

# ప్రజాస్వామ్యం పై దాడి చేసినట్లే..!

## భారత ప్రధాన న్యాయమూర్తి పై జరిగిన దాడి-రాజ్యాంగ వ్యవస్థకు, ప్రజల హక్కులకు ప్రమాదం.

## "సుప్రీంకోర్టు పై దాడి అనేది భారత రాజ్యాంగం ఆత్మ పై దాడి".



డా.జి.బాలస్వామి
న్యాయవాది మరియు ఫ్రీలాన్స్ జర్నలిస్టు.
పూలే అంబేడ్కర్ జ్ఞాన కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా అక్టోబర్ 08:**
భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో సుప్రీంకోర్టు భారత రాజ్యాంగానికి రక్షకురాలిగా ఉంటుంది. ఈ రెండింటికి ఉన్న సంబంధం పై అనేకమంది మేధావులు ,సామాజిక తత్వవేత్తలు, జాతీయ అంతర్జాతీయ వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, అనేక వ్యాసాలు వ్రాసినారు, అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ నాయకురాలు శ్రీమతి సోనియా గాంధీ గారు కూడా తన ప్రకటనను ప్రస్తావిస్తూ ఇది రాజ్యాంగం పై దాడి అని పేర్కొన్నారు. అదేవిధంగా ఆమె ఇండియన్ ఎక్స్ప్రెస్ లో రాజ్యాంగంపై జరిగిన దాడిగా ఖండించడం కూడా జరిగింది ఆయనను మనమందరము రక్షించుకోవాలి అని కూడా చెప్పింది. అయితే సుప్రీంకోర్టు పై జరిగిన దాడిని న్యాయవ్యవస్థపై దాని స్వతంత్రతపై జరిగిన దాడిగా వివరిస్తుంది. భారతన్యాయ దేవత సాక్షిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై దాడికి ప్రయత్నం.సనాతన ధర్మ పరిరక్షణ పేరుతో న్యాయమూర్తి పై దాడికి ప్రయత్నం అత్యంత హేయమైన చర్యగా భావించాలి.మతం మత్తు మెదల్లలో ఎక్కితే మానవత్వం మనిషిలో నశించి క్రూరత్వం పెరిగిపోతుంది.సనాతన మత్తు ఎంతలా పెరిగింది అంటే రాజ్యాంగ విలువలని, న్యాయాన్ని కాంక్షించే రాకేష్ కిషోర్ అనే లాయర్ విచక్షణ కోల్పోయి ఒక కుట్రపూరితంగా, అంతర్గత ఉద్దేశపూర్వకంగా ప్రధాన న్యాయమూర్తి పై దాడి చేయడం అమానవీయమైనది.కానీ ప్రధాన న్యామూర్తి ఇలాంటి చర్యలు నన్ను ప్రభావితం చేయలేవు, మీ వాదనలు వినిపించండి అని కోర్టు హాల్ లో లాయర్ల తో చెప్పడం అనేది ప్రజాస్వామ్య, న్యాయం పై ఆయనకు ఉన్న గొప్ప బలమైన న్యాయపరమైన విశ్వాసం. భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ రచించిన భారతరాజ్యాంగ ఫలితంగా ఒక దళిత వ్యక్తి దేశానికి రెండవ ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు.దీనిని మనుధర్మం సహించ లేక పోతుంది. సనాతన ధర్మం.సనాతన ధర్మ పరిరక్షణ పేరుతో జరిగే దాడిలో ఈ దేశ ప్రధాన న్యాయమూర్తి బాధితుడు. అయితే ఇంకా దేశంలో సామాన్యుల పరిస్థితి ఏమిటి ,ఎలాగ ఉంటుందో ఒక్కసారి ఊహించుకుంటే భయం వేస్తుంది.ఇలాంటి దాడికి పాల్పడే సనాతులకి చట్టం ప్రకారం శిక్ష పడేలా చేసి , మతం కాదు.,రాజ్యాంగం అంతిమ ఫలితం అందరికి తెలిసేలా విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.న్యాయ వ్యవస్థకి , రాజ్యాంగ స్ఫూర్తికి దేశం మొత్తం అండగా నిలబడాల్సిన అవసరముంది.

### భారతరాజ్యాంగ ఆత్మ పైనే న్యాయవాది రాకేష్ కుమార్ బూటు దాడి.



భారతదేశ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయ్ పై జరిగిన సంఘటన పట్ల దేశవ్యాప్తంగా నిరసనలు వెలువెత్తుతున్నాయి. రాజ్యాంగంపై జరిగిన దాడిగా పౌరులు ఖండిస్తున్నారు. సుప్రీంకోర్టు పై దాడి రాజ్యాంగంపై దాడిగా ఎందుకు పరిగణించబడుతుందో దీనికి అనేక కారణాలు ఉన్నాయి. ఎందుకంటే భారత రాజ్యాంగం యొక్క రక్షకురాలు, సుప్రీంకోర్టు రాజ్యాంగాన్ని పరిరక్షిస్తుంది అదేవిధంగా దాని ప్రాథమిక నిర్మాణాన్ని కాపాడుతుంది. దేశానికి సుప్రీంకోర్టు రాజ్యాంగం అందించిన స్వతంత్ర న్యాయవ్యవస్థకు ప్రతీక. మతం ముసుగులో దానిపై దాడి చేయడం అంటే న్యాయవ్యవస్థ స్వతంత్రతను దెబ్బతీయడం అవుతుంది. దేశంలోని అత్యున్నత న్యాయస్థానాలు రాజ్యాంగంలోని ప్రాథమిక నిర్మాణాన్ని ఉల్లంఘించినట్లయితే ఏవైనా రాజ్యాంగ సవరణలను చెల్లుబాటు కానివిగా ప్రకటించగల శక్తి సామర్థ్యాలు ఒక సుప్రీంకోర్టుకు ఉన్నాయి. సుప్రీంకోర్టు న్యాయవ్యవస్థకు అత్యంత కీలకమైన సంస్థ. సనాతన ధర్మం పేరుతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై బూట్ విసరడం అంటే దానిపై దాడి చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థ యొక్క మూలాలను దెబ్బతీయటమేనని స్పష్టంగా వివరిస్తాయి. సుప్రీంకోర్టు పై దాడి అనేది భారతదేశ రాజ్యాంగంపై మరియు అంతర్లీనంగా ఉన్న ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి చేసినట్లు అవుతుంది. సుప్రీంకోర్టు న్యాయవ్యవస్థకు అత్యంత ముఖ్యమైన కేంద్రం. ఎందుకంటే భారత రాజ్యాంగం ద్వారానే దానికి అధికారాలు లభిస్తాయి. ఈ అత్యున్నత సంస్థపై జరిగే ఏ దాడినైనా రాజ్యాంగ వ్యవస్థకు, ప్రజల హక్కులకు ముప్పుగా పరిగణించబడుతుంది. రాజ్యాంగ ఆత్మపైనే న్యాయవాది రాకేష్ కిషోర్ విసిరిన దుర్మార్గమైన బూటు దాడి దళిత ప్రధాన న్యాయమూర్తి పై కాదు."భారతరాజ్యాంగ ఆత్మ పైనే జరిగింది"ఈ దాడిని తీవ్రంగా తీవ్రంగా దేశవ్యాప్తంగా న్యాయవాదులు ఖండిస్తున్నారు. ఇది కేవలం దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిపై జరిగిన దాడి కాదు అనే విషయాన్ని తెలుసుకోవలసి ఉంది. రాజ్యాంగంపై, ప్రజాస్వామ్యంపై, న్యాయవ్యవస్థ ఆత్మగౌరవంపై జరిగిన దాడి. దేశంలో భారత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ గావాయ్ అయిన తరువాత అనేక కీలకమైన తీర్పులు ఇచ్చిన ధైర్యవంతుడు, నిష్పక్షపాత న్యాయమూర్తిగా ఆయనకు మంచి పేరుంది.



అయితే కొంతమంది మతం ముసుగులో ద్వేషపూరిత వ్యక్తులు ఆయనపై తప్పుడు ప్రచారం చేస్తూ "ఆయనను హిందూ వ్యతిరేకంగా" చూపిస్తున్నారు. ఇది పూర్తిగా అబద్ధం అయితే ఈ దాడి దేశానికి ప్రమాదకరం. భారత ప్రధాన న్యాయమూర్తి అనేవారు ఎవరి మతానికి చెందరు ఎవరి కులానికి చెందరు. ప్రధాన న్యాయమూర్తి అనేవారు భారత రాజ్యాంగాన్ని అనుసరించి న్యాయం చేయడం ఆయన ధర్మం, సత్యమే ఆయన మతం, కానీ సనాతన ధర్మం పేరుతో న్యాయమూర్తిని కోర్టు మధ్యలో అవమానించడం సనాతన ధర్మం కాదు. జస్టిస్ గవాయ్ గారి యొక్క భారత న్యాయ వ్యవస్థకు ఆయన సేవలు అపారమైనవి, దేశానిక చాలా అవసరం. ఆయనను గౌరవించడం అంటే రాజ్యాంగాన్ని, దేశ ప్రజాస్వామ్యాన్ని, గౌరవాన్ని కాపాడడమే పౌరుల యొక్క ముఖ్య లక్షణం. ఈ దాడి జరగడంతో ఈ దారుణ ఘటనకు పాల్పడిన వ్యక్తిపై తక్షణ కఠిన చర్యలు తీసుకోవాలని బిజెపి ప్రభుత్వంపై దేశవ్యాప్తంగా నిరసనల ద్వారా ప్రజాస్వామ్యవాదులు, న్యాయవాదులు, మేధావులు నిరసనల ద్వారా కోరుతున్నారు. ఇలాంటి చర్యల వల్ల "న్యాయవ్యవస్థ అవమాన పడుతుంది. దీని ద్వారా హిందూ ధర్మం అపకీర్తి చెందుతుంది". 140 కోట్ల జనాభా ఈ సత్యాలను గుర్తించుకోవాలి. ప్రధాన న్యాయమూర్తి పై దాడి అంటే భారతీయ న్యాయం పై దాడి కాబట్టి మనమందరం దీనిని ఖండించాలి మన భారత రాజ్యాంగ గౌరవాన్ని కాపాడుకోవాల్సిన అవసరము ఈ దేశంపై ఉన్నది. ఇది ఆవేశంతో చేసిన దాడి కాదు, ఒక ప్రణాళిక బద్ధమైన దాడి కుట్రగా భావించాలి. స్వతంత్రతకు భంగం కలిగించే చర్యను రాజ్యాంగంపై దాడి చేసినట్లే అవుతుంది. దేశం సిగ్గుపడే విధంగా ప్రవర్తించారు. ఈ చర్య వెనుక బలమైన కుట్ర ఉంది లోతుగా విచారణ చేయాల్సిన అవసరం కూడా ఉంది నిందితులను కఠినంగా శిక్షించాలి. 71 సంవత్సరాల వయస్సు గల న్యాయవాది రాకేష్ కిషోర్ అనే వ్యక్తి సుప్రీంకోర్టు భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయ్ పై తన బూటు విసరడం దాడికి ప్రయత్నించడం అంటే దేశద్రోహం అవుతుంది. రాకేష్ కేసుల విచారణ జరుగుతున్న సమయంలో పోడియం దగ్గరికి వెళ్లి తన బూటు ను తీసి న్యాయమూర్తి పైకి విసిరేందుకు ప్రయత్నించడం జరిగింది. ఆ సమయంలో కోర్టులో ఉన్న భద్రతా సిబ్బంది వెనువెంటనే స్పందించి న్యాయవాదిని అదుపులోకి తీసుకొని బయటకు తీసుకెళ్లిన సంగతి దేశ ప్రజలందరికీ కూడా తెలిసినదే. అయితే ఆ సందర్భంలో బయటికి వెళుతూ రాకేష్ కిషోర్.. "సనాతన్ కా అప్మాన్ నహి సహేంగే" సనాతన ధర్మాన్ని అవమానించడాన్ని సహించమంటూ కేకలు వేస్తూ అరవడం జరిగింది. ఈ సంఘటనపై చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా గవాయ్ గారు ఏమాత్రం చలించలేదు. కోర్టులో ఉన్న ఇతర న్యాయవాదులను ఉద్దేశించి "దీనివల్ల దృష్టి మరల్చుకోకండి.మేము దృష్టి మరల్చలేదు. ఈ విషయాలు నన్ను ప్రభావితం చేయవు" అని అంటూ వాదనలను కొనసాగించమని ఆదేశించారు ఈ విషయాలు కూడా దేశ ప్రజలందరికీ తెలుసు. అసలు సనాతన ధర్మం అంటే ఇదే తన భావాలను అనుగుణంగా లేని వాళ్ళ మీద దాడి చేయడం, చెప్పులు విసరడం, బూతులు తిట్టడం, ఆగ్రహం అసహనముతో గింజుకుపోవడం, నిజాన్ని తట్టుకోలేకపోవడం. ఓం శాంతి శాంతి శాంతి ః అని మంత్రాలు వల్లె వేస్తూ శాంతికి విగాథం కల్పించడం సర్వేజనా సుఖినోభవంతు అని చెబుతూ జనాల మీద దాడి చేయడం ఈ గోముఖ వ్యాగ్ర సంతతే నేటి సనాతన ధర్మికులు ఇలా ఉంటే సామాన్య ప్రజలకు రక్షణ ఉంటుందా? ప్రధాన న్యాయమూర్తి పై దాడి దేశం పై దాడిగా భావించాలి. అత్యున్నత వ్యవస్థ పైన దాడి జరిగితే ఈ దేశంలో సామాన్య పౌరులకు రక్షణ కల్పించడం ఎలా? ఈ దేశములో అంతో ఇంతో ప్రజాస్వామ్యం బతికి బట్ట కడుతూ ఉందంటే అది మన భారత రాజ్యాంగం పెడుతున్న భిక్షే కదా.! అటువంటి రాజ్యాంగాన్ని పరిరక్షించే వ్యవస్థ భారత సర్వోన్నత న్యాయస్థానం! ఆ న్యాయస్థాన అధినేత ఈ దేశానికి రెండవ దళిత సామాజిక వర్గానికి చెందిన ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయ్ గారి పైకి లాయరు రాకేష్ కిషోర్ తన కాలికున్న బూటు తీసి సాక్షాత్తు సర్వోన్నత న్యాయస్థానంలో విసరడం ప్రధాన న్యాయమూర్తి పై కాదు, సర్వోన్నత పవిత్రమైన భారత రాజ్యాంగం ఆత్మ పైన! ఈ దేశ న్యాయ వ్యవస్థ పైన! న్యాయ దేవత పైన! ఆ లాయర్ రాకేష్ కిషోర్ కు అన్నం పెడుతున్న అన్నం గిన్నె పైనే ! ఆ లాయరుకు ఆయన కుటుంబానికి బతుకునిచ్చిన తల్లి పైనే! తన నల్లకోటుకు, గౌను కు, సమాజంలో ఒక సాంఘిక హోదానిచ్చిన ప్రజల నమ్మకం పైన! తనకు సంపూర్ణ స్వేచ్ఛ నిచ్చిన ప్రజాస్వామ్యం పైన! తాను నమ్ముతున్న తన ధర్మం పైన! ఈ దుర్మార్గం వెనుక ఏ శక్తి ఉన్నా అలాంటి శక్తులను కూకటి వేళ్ళతో పెకలించకపోతే ఈ దేశ ప్రజాస్వామానికి ఇంతటితో కాలం చెల్లినట్లే! చీకటి రోజులు వచ్చినట్లే! ఇది ప్రతి పౌరుడు తనపై జరిగిన దాడిగా భావించాలి. కులం, మతం, భాష, ప్రాంతీయ తత్వాలకు అతీతంగా మేధావులు, న్యాయవాదులు, ప్రజాస్వామ్యవాదులు, రచయితలు, స్పందించాలి భారతదేశ ఔన్నత్యాన్ని కాపాడుతారని పరిరక్షిస్తారని కోరుకుందాం.



# అద్దె బస్సు డ్రైవర్ పై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి.

**ఆర్టీసీ ఉద్యోగులకు ప్రయాణికులు నుండి రక్షణ కల్పించాలి. - మెరుపు సమ్మె పాల్గొన్న హైర్ బస్ డ్రైవర్లు, నిలిచిన వందలాది బస్సులు.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 08:**
కడప జిల్లా లో ఆళ్లగడ్డ డిపోకు హెయిర్ బస్ డ్రైవర్ మహమ్మద్ పై చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి మరొక్కసారి ఘటనలు పునరావతం కాకుండా చర్యలు తీసుకోవాలని నంద్యాల జిల్లా వ్యాప్తంగా అన్ని బస్ స్టేషన్ల బస్సులను నిలిచి మెరుపు సమ్మెలో ముందలాదిమంది డ్రైవర్లు పాల్గొనడం జరిగిందని ఇప్పటికైనా అధికారులు ఆర్టీసీ ఉద్యోగులందరికీ రక్షణ కల్పించాలని ప్రయాణికులు సమయమనంతో తమ గమ్యస్థానాలకు చేరేలా జాగ్రత్తలు పాటించాలని సిఐటియు ఆధ్వర్యంలో మెరుపు సమ్మె నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, కే మహమ్మద్ గౌస్, పట్టణ కోశాధికారి పి వెంకట లింగం లతోపాటు యూనియన్ నాయకులు రాజశేఖర్,మధు వీరితో వీరితోపాటు 70 మంది డ్రైవర్లు పాల్గొనడం జరిగింది.
అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయడం జరిగిందని ఆ పథకాన్ని సీఐటీయూ గా స్వాగతిస్తున్నామని అయితే ఆ రోజు నుంచి



డ్రైవర్లకు, కండక్టర్లకు రక్షణ లేకుండా పోయిందని రాష్ట్రంలో ప్రతిరోజు ఎక్కడో ఒకచోట దాడులు జరుగుతున్నాయని నిన్న కడప జిల్లా కొవ్వూరు సమీపంలో హైర్బస్సు లో అప్పటికే 72 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారని, నిలబడే అవకాశం కూడా లేదని అందుకు వెనక బస్సుకు రావాలని డ్రైవరు తెలియజేసి బస్సు ఆపకుండా ముందుకు వెళ్లడంతో కొంతమంది ప్రజలను సమీకరించి వెంటపడి బస్సును ఆపి మహమ్మద్ అనే డ్రైవర్ పై దాడి చేసి తల పగలగొట్టడం చాలా దుర్మార్గమైన చర్య అని రాష్ట్రంలో ఇటువంటి ఘటన జరగడం వలన డ్రైవర్లు,కండక్టర్లు భయాందోళనకు గురవుతున్నారని అన్నారు. ప్రయాణికులకు ఏ ఇబ్బందులు కలిగిన అధికారులకు ఫోన్ చేయడం మంచిదే అయితే డ్రైవర్లకు, కండక్టర్లకు రక్షణ కల్పించడం కూడా ప్రధానమైన అంశం అని ఒక సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల పై ప్రయాణికులు ఈ విధంగా దాడులకు పాల్పడుతుంటే వారిపైన కఠిన చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేయడంతో రోజురోజుకు మరింత పెరుగుతున్నాయని ప్రజలకు డ్రైవర్ల పైన, కండక్టర్ల పైన దాడులకు పాల్పడితే శిక్షలు పడేలా జైలుకు వెళ్లేలా చట్టం ఉందని అటువంటి చట్టాన్ని అమలు చేయకపోవడం వలన ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని ఇప్పటికైనా ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ప్రతి ఆర్టీసీ బస్టాండ్ లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రతి బస్సుకు స్టిక్కర్ లేదా రాతపూర్వక హెచ్చరిక గుర్తుచేసేలాగా రాయించాలని అన్నారు ప్రయాణికులు కూడా కొంత ఆలస్యమైనా తమ గమ్యస్థానం చేరేలాగున పూర్తిగా నిండిన బస్సులలో కాకుండా వెనుక బస్సు కోసం సమయం కేటాయించుకునే లాగున ప్రజలు ఆర్టీసీ ఉద్యోగులకు సహకరించాలని ప్రస్తుతం ఉన్న స్విచ్వేషన్ లో ఆన్లైన్ ట్రాన్సాక్షన్, టికెట్ ఇచ్చే సమయం పెరిగిపోతుందని అందుకు సహకరించేలాగున ప్రయాణికులు ఉండాలని, ఇలాంటి ఘటనలు అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడతామని దాడి చేసిన వారి పైన కఠిన చర్యలు తీసుకునేంతవరకు సమ్మె విరమించేది లేదని తెలుపడంతో ఏపీఎస్ఆర్టీసీ రీజనల్ మేనేజర్ రజియా సుల్తానా గారు సిఐటియు నాయకులతో, కార్మికుల తో చర్చించి ప్రజలకు అవగాహన కల్పించేలాగున హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని, ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా మేమే దాడి చేసిన వారిపై కేసులు పెట్టి అరెస్టు అయ్యేలాగున చర్యలు తీసుకుంటామని, అదే విధంగా ప్రజలు కూడా ఆర్టీసీ ఉద్యోగులకు సహకరించి సంస్థ అభివృద్ధి కోసం సహకరించాలని కోరారు.

# చింతలయపల్లి గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం

**గ్రామాలలో అందరూ ఫ్యాక్షన్ కలహాలకు దూరంగా ఉండి శాంతియుతంగా జీవించాలి.**

**చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్.**





**ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ క్రైమ్ అక్టోబర్ 08:**
పోలీసులు ప్రజలకు మరింత చేరువై ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్న నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఆదేశాలమేరకు చింతలయపల్లి గ్రామంలో, కొలిమిగుంట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ సీఐ కొలిమిగుంట్ల మరియు పోలీస్ సిబ్బందితో కలిసి "పల్లె నిద్ర" కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు ఫ్యాక్షనిజం వల్ల కలిగే ప్రమాదాలు, ప్రాణ నష్టం, కుటుంబాల వినాశం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఫ్యాక్షన్ కలహాలకు దూరంగా ఉండి, శాంతియుతంగా జీవించాలనే సూచనలు చేశారు.డీఎస్పీ ప్రమోద్ మాట్లాడుతూ..గ్రామ సమస్యలు, వర్గ వివాదాలు, ఫ్యాక్షనిజం కారణంగా జరిగే అల్లర్లు, హత్యలు వంటి చర్యల వల్ల వ్యక్తులు మాత్రమే కాకుండా కుటుంబాలూ నష్టపోతాయని హెచ్చరించారు. ఫ్యాక్షన్ సంబంధిత కార్యకలాపాలకు దూరంగా ఉండి, గ్రామంలో సామరస్య వాతావరణాన్ని నెలకొల్పాలని గ్రామ ప్రజలను కోరారు. ఈ సందర్భంగా గ్రామంలోని రౌడీషీటర్లకు మళ్లీ నేర కార్యకలాపాల్లో పాల్గొంటే కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరించారు.

# డోన్ పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమం.

## మాదకద్రవ్యాల నివారణకు కృషి చేద్దాం... సురక్షితమైన సమాజాన్ని నిర్మిద్దాం.





**ఆంధ్ర ప్రగతి డోన్ క్రైమ్ అక్టోబర్ 08:**
ఈగల్ ఐ.జీ.పి శ్రీ ఆ.కే. రవికృష్ణ, ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ సూచనలతో నంద్యాల జిల్లాలోని డోన్ టౌన్ లో నీ వైష్ణవి కాలేజీ నందు డోన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంతియాజ్ భాష ఆధ్వర్యంలో ఈ రోజు విద్యార్థులకు" డ్రగ్స్ వద్దు బ్రో" కార్యక్రమము నిర్వహించడమైనది.
ఈ కార్యక్రమములో డోన్ టౌన్ పట్టణ సి ఐఇంతియాజ్ భాష మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని గంజాయి మత్తు మిమ్మల్ని మీ కుటుంబాన్ని నాశనం చేస్తుందని మరియు వాటి వలన కలిగే అనర్థాలపై అదృశ్యమాధ్యమం ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది.
మాదకద్రవ్యాల సమాచారం ఏదైనా ఉన్న ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు తెలియజేయాలని తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపినారు. అనంతరం ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైబర్ క్రైమ్ నేరాల గురించి అవగాహన కల్పిస్తూ సామాజిక మాధ్యమాలపై స్వీయ నియంత్రణ, అప్రమత్తత కలిగి ఉండడం వలన సైబర్ క్రైమ్ నేరాలను నియంత్రించవచ్చునని తెలియజేశారు.
రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రోడ్డు భద్రత ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యం చేరాలని అవగాహన కల్పించారు.
ఈ కార్యక్రమంలో డోన్ టౌన్ పట్టణ సి ఐ ఇంతియాజ్ భాష, ఈగల్ టీం సిబ్బంది ప్రసాద్, మనోహర్, శక్తి టీం లక్ష్మీ పాల్గొన్నారు.

## తప్పుడుసర్టిఫికేట్లు జారీ చేస్తున్న పాఠశాలల పై

# క్రిమినల్ కేసు నమోదు చేయాలి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 08:**
ఎస్.సి బ్యాక్ లాక్ కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థలో అటెండర్ ఉద్యోగ నియామకం కొరకు 2018 సంవత్సరంలో నోటిఫికేషన్ జారీ చేయగా, 20 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడం జరిగింది. అభ్యర్థుల విద్యార్హత సర్టిఫికేట్లపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని అప్పటి కర్నూలు డిఈఓ సాయిరాంకు జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ లేఖ వ్రాసుకోవడం జరిగింది. ఈ అంశంలో డిఈఓ సాయిరాం నంద్యాల మండల విద్యాధికారి బ్రహ్మం, అప్పటి నంద్యాల ఉప విద్యాశాఖాధికారి మొహమ్మద్ బేగ్ లను విచారణాధికారులుగా నియమిస్తే, వారు మరియు అప్పటి డిఈఓ కర్నూలు సాయిరాం సహకరించడం వల్ల తప్పుడు విద్యార్హతల సర్టిఫికేట్లు సమర్పించిన టి. బాలాస్వామి కుమారుడు టి. నాగ భాస్కర్ కు కర్నూలు గ్రంథాలయ సంస్థలో అటెండర్ ఉద్యోగం ఇవ్వడం జరిగిందని బహుజన టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక జిల్లా అధ్యక్షులు కె సతీష్ కుమార్ తెలిపారు.
బి.టి.ఎఫ్ జిల్లా అధ్యక్షులు కె సతీష్ కుమార్ మాట్లాడుతూ కాసులకు కక్కుర్తి పడిన కొన్ని విద్యాసంస్థలు శ్రీ సత్యవాణి విద్యామందిర్ హైస్కూల్ ఆత్మకూరు ముగ్గురికి నాగ భాస్కర్, కె. బాలరాజు నాయక్, యం. భాగ్యలక్ష్మి భాయి లకు, శ్రీ ద్వారకామాయి ఇంగ్లిష్ మీడియం స్కూల్ నంద్యాల సూర్య దీపక్ కు, శ్రీ లక్ష్మి రాఘవేంద్ర పబ్లిక్ స్కూల్, ఆళ్లగడ్డ బి. సురేష్ కు, సి.ఎస్.ఐ హైస్కూల్ నందికోట్కూరు, యం. వీరన్న కు, శ్రీ రాఘవేంద్ర విద్యాసదన్, కర్నూలు, ఉషారాణి లకు తప్పుడు విద్యార్హత సర్టిఫికెట్లు జారీ చేసినట్లు అప్పట్లో నిర్ధారణ అయితే నేటికి ఆయా యాజమాన్యాలపై చర్యలు తీసుకోకపోవడం చాలా భాధాకరం అన్నారు.
అంతేకాకుండా ఈ విషయంలో పూర్తి ఆధారాలతో 17.07.2023న బహుజన టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అప్పటి నంద్యాల కలెక్టర్ కు పిర్యాదు చేయగా, విచారణాధికారి అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీమతి యం. అనురాధ విచారణ చేపట్టి టి. నాగ భాస్కర్ యొక్క సర్టిఫికేట్ బోగస్ అని తేల్చి 30.09.2023ననే విచారణ నివేదిక అప్పటి నంద్యాల ఇంచార్జి డిఈఓ గా కొనసాగిన కొండా సుధాకర్ రెడ్డి నివేదిక నంద్యాల కలెక్టర్కు సమర్పించకుండా దోషులతో కుమ్మక్కై ఆరు నెలలు తొక్కి పెట్టడం జరిగిందని తెలిపారు. ఫలితంగా నాగభాస్కర్ నేటికి ఉద్యోగంలో కొనసాగుచున్నారని తెలిపారు.ఎస్.సి బ్యాక్ లాక్ జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగ నియామకాల ఒక ఎస్.సి బ్యాక్ లాక్ ఆఫీస్ సబార్డినేట్ పోస్ట్ కొరకు నిర్వహించిన ఉద్యోగ నియామకాల్లో తప్పుడు విద్యార్హతల సర్టిఫికేట్లు సమర్పించిన టి. బాలాస్వామి కుమారుడు టి. నాగ భాస్కర్ కు నంద్యాల మండల విద్యాధికారి బ్రహ్మం, అప్పటి నంద్యాల ఉప విద్యాశాఖాధికారి మొహమ్మద్ బేగ్, అప్పటి డిఈఓ కర్నూలు సాయిరాం సహకరించడం వల్ల ఉద్యోగం ఇచ్చినట్లు రికార్డులలో స్పష్టంగా ఉన్నది. కాసులకు కక్కుర్తి పడిన కొన్ని విద్యాసంస్థలు శ్రీ సత్యవాణి విద్యామందిర్ హైస్కూల్ ఆత్మకూరు వారు ముగ్గురికి టి. నాగ భాస్కర్, కె. బాలరాజు నాయక్, యం. భాగ్యలక్ష్మి భాయి లకు, శ్రీ ద్వారకామాయి ఇంగ్లిష్ మీడియం స్కూల్ నంద్యాల వారు సూర్య దీపక్ లకు, శ్రీ లక్ష్మి రాఘవేంద్ర పబ్లిక్ స్కూల్, ఆళ్లగడ్డ వారు బి. సురేష్ లకు, సి.ఎస్.ఐ హైస్కూల్ నందికోట్కూరు వారు యం. వీరన్న లకు, శ్రీ రాఘవేంద్ర విద్యాసదన్, కర్నూలు వారు ఉషారాణి లకు తప్పుడు విద్యార్హత సర్టిఫికెట్లు జారీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పిర్యాదు విద్యార్హత సర్టిఫికెట్లు కర్నూలు గ్రంథాలయ సెక్రటరీ కి సమర్పించడం జరిగింది. అభ్యర్థుల 8వ తరగతి విద్యార్హత మార్కుల జాబితాలో 590 పైబడి మార్కులు ఉండడం గమనించిన కర్నూలు గ్రంథాలయ సెక్రటరీ సందేహం కలిగి సర్టిఫికేట్లు వాస్తవమైనవో? కాదో? విచారణ చేసి నివేదిక ఇవ్వాలని అప్పటి కర్నూలు విద్యాశాఖాదికారి సాయిరాం గారికి 2019 సంవత్సరంలో లేఖ వ్రాశారని బహుజన టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక జిల్లా అధ్యక్షులు కె. సతీష్ కుమార్ తెలిపారు. తప్పుడు ఉద్యోగ నియామక పత్రాలు సృష్టించిన వారిపై క్రిమినల్ కేసు నమోదుకై ప్రస్తుత కర్నూలు డిఈఓ శామ్యూల్ పాల్ పోలీస్ వారికి ఏ విధంగా అయితే పిర్యాదు చేశారో, అదేవిధంగా తప్పుడు విద్యార్హత సర్టిఫికెట్లు జారీ చేసిన విషయలో మరియు అందుకు సహకరించిన నంద్యాల యం.ఈ.ఓ బ్రహ్మం, అప్పటి నంద్యాల ఉప విద్యాశాఖాధికారి మొహమ్మద్ బేగ్, అప్పటి ఆత్మకూరు యంఈఓ జానకిరామ్, అప్పటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆత్మకూరు హెచ్.ఎం మరియు సిబ్బందిపై, అప్పటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పారుమంచాల హెచ్.ఎం మరియు సిబ్బందిపై మరియు దోషులకు సహకరించి విచారణ నివేదికను తొక్కిపెట్టిన అప్పటి నంద్యాల ఇంచార్జ్ డిఈఓ సుధాకర్ రెడ్డి పై మరియు ప్రవేటు యాజమాన్యాలు శ్రీ సత్యవాణి విద్యామందిర్ హైస్కూల్ ఆత్మకూరు, శ్రీ ద్వారకామాయి ఇంగ్లిష్ మీడియం స్కూల్ నంద్యాల, శ్రీ లక్ష్మి రాఘవేంద్ర పబ్లిక్ స్కూల్, ఆళ్లగడ్డ, శ్రీ రాఘవేంద్ర విద్యాసదన్, కర్నూలు, సి.ఎస్.ఐ హైస్కూల్ నందికోట్కూరు లపై క్రిమినల్ కేసునమోదుకై సిఫారసు చేయాలని, శాఖాపరమైన చర్యలకు సిఫారసు చేయాలనీ కర్నూలు మరియు నంద్యాల డిఈఓ లకు బి.టి.ఎఫ్ విజ్ఞాపన చేసింది.

## కీటక జనిత వ్యాధుల నివారణ పై అవగాహన కార్యక్రమం.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 08:**
నంద్యాల జిల్లా నంద్యాల నందు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గాంధీ నగర్ మీటింగు హాల్ నందు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆర్ వెంకటరమణ ఆధ్వర్యంలో కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమం పై అవగాహన మరియు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలోజిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఆర్ వెంకటరమణ మాట్లాడుతూ.. మలేరియా డెంగ్యూ చికెన్ గునియా మెదడువాపు, బోదకాలు వంటి వ్యాధులు దోమకాటు వల్ల వస్తుందని,గ్రామ పట్టణ ప్రాంతాల్లో దోమకాటుకు ప్రజలు గురికాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి,మరియు జ్వరాలపై అవగాహన కల్పిస్తూ వ్యాధి లక్షణాలపై వారికి తెలియజేయాలని గ్రామాలలో పట్టణలలో దోమలపై అవగాహన కల్పించాలని.దోమలవల్ల కాటు వల్ల జరిగే ప్రాణహాని గురించి ప్రజలుకు అవగాహన మరియు ప్రతి శుక్రవారం ప్రజలు ఫ్రై డే డ్రై డే పై అవగాహన కల్పించాలని తెలియచేశారు. కార్యక్రమంలో డాక్టర్ నిరంజన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మెడికల్ కాలేజ్, మలేరియా అధికారి సి చంద్రశేఖర్,సహాయ జిల్లా అధికారి కె సత్యనారాయణ, మలేరియా ఆఫీసు సిబ్బంది జిల్లా లోని సబ్ యూనిట్ అధికారులు సూపర్ వైజర్ సిబ్బంది ఆరోగ్య కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## 21మందితో అమరావతి

# గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ కమిటీ



అమరావతి,**అక్టోబర్ 8 ఆంధ్ర ప్రగతి :** అమరావతి గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ అభివృద్ధి కోసం 21 మందితో సలహా కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కమిటీ ఛైర్మన్‌గా నీతి ఆయోగ్ సభ్యులు వీకే సారస్వత్, కో-ఛైర్మన్‌గా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, కమిటీ సభ్య కార్యదర్శిగా ఎస్‌ఆర్‌ఎం గ్రూప్ డైరెక్టర్ నారాయణరావు నియమితులయ్యారు. వీరితో పాటు పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, హైడ్రోజన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ఆర్కే మల్హోత్రా, జాతీయ స్థాయిలో పేరొందిన వివిధ సంస్థల ప్రతినిధులను సభ్యులుగా నియమించారు. జులై 18, 19వ తేదీల్లో అమరావతిలో జరిగిన గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్ తీర్మానాల మేరకు కమిటీని నియమించారు. హైడ్రోజన్, దాని ఉత్పత్తుల ప్రమోషన్ కోసం సలహా కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో ప్రభుత్వం తెలిపింది.
---------------

# జస్టిస్ గవాయ్‌పై దాడికి నిరసన

## ప్లకార్డులతో నిరసన తెలిపిన ఉద్యోగులు

హైదరాబాద్,**అక్టోబర్ 8 ఆంధ్ర ప్రగతి :** భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్. గవాయిపై జరిగిన దాడికి నిరసనగా తెలంగాణ సచివాలయంలో ఆగ్రహావేశం వ్యక్తమైంది. సెక్రటేరియట్ ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగులు చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని జస్టిస్ గవాయి జిందాబాద్‘, దళితులపై దాడులు ఆపాలి, న్యాయవ్యవస్థ గౌరవాన్ని కాపాడాలి అంటూ నినాదాలు చేశారు. సి.జె.ఐ. బిఆర్. గవాయి పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ప్రభుత్వం, చట్ట వ్యవస్థ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సెక్రటేరియట్ ఉద్యోగుల సంఘం నేతలు మాట్లాడుతూ .. బిఆర్. గవాయి దేశ అత్యున్నత న్యాయస్థానానికి చెందిన రెండవ దళిత ప్రధాన న్యాయమూర్తి. ఆయనపై దాడి జరగడం అంటే న్యాయవ్యవస్థ, సామాజిక సమానత్వం మీద దాడి చేసినట్లే. ఇది ప్రజాస్వామ్యానికి పెద్ద మచ్చ అని పేర్కొన్నారు. నిరసనలో పాల్గొన్న ఉద్యోగులు బి.ఆర్. గవాయికి సంఘీభావం వ్యక్తం చేస్తూ, ఆయనకు పూర్తి భద్రత కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# స్వదేశీ టెక్నాలజీకి ఆదరణ

## జోహో మెయిల్‌కు మారిన కేంద్ర మంత్రులు

## ఈ జాబితాలో తాజాగా చేరిన అమిత్ షా

న్యూఢిల్లీ,**అక్టోబర్ 8 ఆంధ్ర ప్రగతి :**




దేశీయ ఉత్పత్తులు, సేవలను వినియోగించాలన్న ప్రధాని నరేంద్రమోదీ పిలుపుతో కేంద్రమంత్రులు సిద్ధం అవుతున్నారు. స్వదేశీ టెక్నాలజీని ప్రోత్సహించేందుకు, డిజిటల్ ఇండియాలో భాగంగా 'జోహో' ప్లాట్‌ఫామ్ వైపు మొగ్గుచూపుతున్నారు. అశ్వినీ వైష్ణవ్, ధర్మేంద్ర ప్రధాన్ ఆ సంస్థ సేవలు వినియోగిస్తుండగా.. కేంద్ర హోంమంత్రి అమిత్ షా జోహో మెయిల్‌లోకి మారిపోయారు. ఈ విషయాన్ని ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు. హలో.. నేను జోహో మెయిల్‌కు మారాను. నా ఈమెయిల్ చిరునామాలో ఈ మార్పును గమనించండి. నా కొత్త మెయిల్ అడ్రస్ గురించి అమిత్ షా తన పోస్టులో రాసుకొచ్చారు. ఇకనుంచి మెయిల్స్ అన్నీ ఈ కొత్త అడ్రస్‌కే పంపాలని చెప్పారు. భారత్‌పై అమెరికా సుంకాల మోత, జీఎస్టీ సంస్కరణల వేళ ప్రధాని మోదీ 'స్వదేశీ' పిలుపు ఇచ్చిన సంగతి తెలిసిందే. భారత్ బలమైన దేశంగా ఎదుగుతున్న వేళ.. కొన్ని సవాళ్లు తప్పవు. అటువంటి సమయాల్లో 'ఆత్మనిర్భర్' స్ఫూర్తిని కొనసాగించాలి. ఈ నేపథ్యంలో స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించండి అని ఎన్డీయే ఎంపీలకు సూచించారు. ఈ నేపథ్యంలోనే మంత్రులు జోహో సేవలను వినియోగిస్తున్నారు. జీమెయిల్, మైక్రోసాఫ్ట్ ఔట్‌లుక్‌కు పోటీగా జోహో మెయిల్ ను తీసుకువచ్చారు. ఇప్పుడు ఈమెయిల్‌లోకి అమిత్ షా మారగా.. మైక్రోసాఫ్ట్ పవర్‌పాయింట్ బదులు జోహోతోనే కేబినెట్ ప్రెజెంటేషన్ తయారు చేసినట్లు అశ్వినీ వైష్ణవ్ వెల్లడించిన సంగతి తెలిసిందే. జోహో రూపొందిన మెసేజింగ్ యాప్ 'అరట్టై'ని వాడాలంటూ ధర్మేంద్ర ప్రదాన్ ఇంతకుముందు పిలుపునిచ్చారు. ప్రస్తుతం అరట్టైకు విశేష ఆదరణ లభిస్తోంది. ఈ యాప్‌ను విపరీతంగా డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. యూజర్ల ప్రైవసీ కోసం త్వరలోనే 'అరట్టై'లోనూ ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని జోహో సహ వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు తాజాగా వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇందులో సమాచార గోప్యతపై పెద్దఎత్తున చర్చ జరుగుతోన్న సమయంలో ఈ స్పందన వచ్చింది.

# వరుస లాభాలకు బ్రేక్

## నష్టాల్లో ముగిసిన దేశీయ మార్కెట్లు

న్యూఢిల్లీ,**అక్టోబర్ 8 ఆంధ్ర ప్రగతి :**



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. రోజంతా ఒడుదొడుకులు ఎదుర్కొని చివరికి నష్టాలతో ముగిసాయి. దీంతో సూచీల నాలుగు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. క్యూ2 ఫలితాల సీజన్ త్వరలో ప్రారంభం కానుండడం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాల నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తత పాటించారు. ఐటీ, కన్స్యూమర్ డ్యూరబుల్ షేర్లు మినహా మిగిలిన అన్ని రంగాల షేర్లు నష్టాలు చవిచూశాయి. సెన్సెక్స్ ఉదయం 81,899.51 పాయింట్ల వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. కాసేపటికే మళ్లీ లాభాల్లోకి వచ్చింది. ఈ క్రమంలోనే 82,257.74 వద్ద గరిష్ఠాన్ని తాకింది. కాసేపటికే మళ్లీ నష్టాల్లోకి జారుకుంది. ఇలా రోజంతా ఒడుదొడుకులు ఎదుర్కొన్న సూచీ.. చివరికి 153.09 పాయింట్ల నష్టంతో 81,773.66 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 62.15 పాయింట్ల నష్టంతో 25,046.15 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.80గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, బీఈఎల్, అల్ట్రాటెక్ సిమెంట్, ట్రెంట్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. టైటాన్, ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 66.16 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4043.76 డాలర్ల వద్ద ట్రేడయ్యింది.



# మళ్లీ అవకాశాలు పట్టుకుంటున్న పూజా

ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న మోస్ట్ టాలెంటెడ్ భామల్లో టాప్‌లో ఉంటుంది పూజాహెగ్డే. తమిళం, హిందీ, తెలుగు భాషల్లో టాప్ స్టార్లతో కలిసి నటించి వన్ ఆఫ్ ది లీడింగ్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగింది. ఈ పొడుగు కాళ్ల సుందరికి తెలుగులో హిట్ పడక చాలా కాలమే అవుతుంది. తెలుగులో కూడా బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకుంటున్న మాలీవుడ్ స్టార్ యాక్టర్ దుల్కర్ సల్మాన్. ఈ లీడింగ్ హీరో రవి నెలకుడిటి దర్శకత్వంలో ఓ తెలుగు సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్‌లో జెట్ స్పీడ్‌లో షూటింగ్ కొనసాగుతోంది. ఈ సినిమాతో లాంగ్ గ్యాప్ తర్వాత పూజా హెగ్డే మళ్లీ తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. తాజా కథనాల ప్రకారం ఈ సినిమా కోసం పూజా హెగ్డే ఏకంగా రూ.3 కోట్లు పారితోషికం తీసుకుంటుందని టాక్. అయితే రెమ్యునరేషన్ భారీగా డిమాండ్ చేస్తున్న కారణంగా పూజాహెగ్డే తెలుగు సినిమాలకు దూరమైందని కొన్ని రోజుల క్రితం వార్తలు చక్కర్లు కొట్టాయి. కానీ దుల్కర్ సల్మాన్ టీంకు ఈ విషయంలో ఎలాంటి అభ్యంతరాలు లేకపోవడంతో పూజా హెగ్డేను తమ టీంలోకి తీసుకుందట. ఇక ఈ పుకార్లకు ఫుల్ స్టాప్ పెడుతూ తెలుగులో దుల్కర్ సల్మాన్ సినిమాతో మళ్లీ ఫాంలోకి రావాలని చూస్తున్నట్టు అర్థమవుతుంది. ఇటీవలే రజినీకాంత్ నటించిన కూలీ సినిమాలో మోనికా సాంగ్‌లో మెరిసింది పూజా హెగ్డే. ఈ పాటలో అందాలు ఆరబోస్తూ కుర్రకారుకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. కూలీ సాంగ్ భారీ హిట్ అయింది. ఇక దుల్కర్ సల్మాన్ సినిమా బ్లాక్ బస్టర్ అయితే పూజాహెగ్డేకు తెలుగులో మళ్లీ మంచి రోజులు వచ్చినట్టేనని చెప్పొచ్చు.

# మాస్ జాతర నుంచి మరో పాట

## ఓలేలోలే పాటపై విమర్శలను తిప్పికొట్టిన రవితేజ




రవితేజ హీరోగా శ్రీలీల హీరోయిన్‌గా కొత్త దర్శకుడు భాను భోగవరపు తెరకెక్కించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మాస్ జాతర'. అక్టోబర్ 31న రిలీజ్ కానుంది. ఈనేపథ్యంలో 'హుడియో హుడియో' పాటను విడుదల చేయనున్నారు. చిట్టి చిలకా.. చిన్న మొలకా..అంటూ సాగే లిరిక్స్‌ను దేవ్ రాయగా అబ్దుల్ వహాబ్, భీమ్స్ సిసిరోలియో ఆలపించారు. ఇటీవల ఇందులోని 'ఓలే ఓలే' లిరికల్ సాంగ్‌ను రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ పాట లిరిక్స్‌లో అసభ్య పదాలు ఉన్నాయిని విమర్శలు వచ్చాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో రవితేజ, దర్శకుడు ఈ విమర్శలపై స్పందించారు. కొన్నిటిపై బోల్డ్ మూవీలు అనే ముద్ర వేస్తారు. అలాంటి వాటితో ఎవరికీ ఇబ్బంది రాదు. కానీ, వారికి నా సినిమాతో మాత్రమే సమస్య వచ్చింది. మా గ్రామాల్లో స్థానికంగా జరిగే ఉత్సవాల్లో కొంతమంది చిన్న చిన్న కథలను పాటలుగా చెబుతుంటారు. వాళ్లు తిట్టుకున్నట్లు అనిపిస్తుంది కానీ, వాస్తవానికి వాళ్లు చాలా ప్రేమగా మాట్లాడుకుంటారని దర్శకుడు భాను అన్నారు. విమర్శలు చేసేవారు కేవలం పాటలోని కొన్ని పదాలను మాత్రమే చూస్తున్నారు. తర్వాత వచ్చే సరదా సంభాషణలను చూడడం లేదు. సినిమా చూశాక ఈ పాట వెనక ఉన్న అసలు కథ మీకు అర్థమవుతుంది. ప్రేక్షకులకు అందరికీ ఈ పాట నచ్చుతుంది. అయినా ఇప్పుడు ఇంగ్లిష్‌లో కొన్ని పదాలు సాధారణం అయిపోయాయి. వాటిని తెలుగులో చెప్పినప్పుడే కొందరికి సమస్య వస్తుందని రవితేజ చెప్పారు. ఇక ఈ పాట సినిమాలో సన్నివేశానికి సరిగ్గా సరిపోతుందని శ్రీలీల అన్నారు.

# ఓటిటిలోకి వార్-2 ఎంటర్




బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్, టాలీవుడ్ స్టార్ నటుడు ఎన్టీఆర్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం వార్. కియారా అద్వానీ ఈ సినిమాలో కథానాయికగా నటించగా.. అనిల్ కపూర్, అశుతోష్ రాణా, అలియాభట్, బాబీ దేవోల్, శర్వారీ వాఘ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాకు అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించగా.. యష్‌రాజ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై ఆదిత్య చోప్రా నిర్మించాడు. ఈ చిత్రం ఇండెపెండెన్స్ కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చి మిక్స్‌డ్ టాక్ తెచ్చుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ప్లిక్స్‌లో ఈ చిత్రం అక్టోబర్ 9 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు ప్రకటించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఇండియన్ రా ఏజెన్సీలో ప్రముఖుడైన ఏజెంట్ కబీర్(హృతిక్) కిరాయి హంతకుడిగా మారి హత్యలు చేస్తుంటాడు. ఇదిలావుంటే.. చైనా, రష్యా, శ్రీలంక, మయన్మార్, బంగ్లాదేశ్ దేశాలన్నీ ఒక కోటరీగా మారి, 'కలి' పేరుతో ఇండియా పతానానికి ఎ÷-లాన్ చేస్తాయి. ఈ మిషిన్‌ని కబీర్‌కు అప్పజెబుతాయి. కబీర్‌ను అడ్డుకునేందుకు విక్రమ్ చలపతి (జూనియర్ ఎన్టీఆర్) రంగంలోకి దిగుతాడు. అసలు కబీర్‌కీ, విక్రమ్‌కు మధ్య ఉన్న బంధం ఏంటి? 'కలి' వల్ల భారత ప్రధానికి పొంచివున్న ముప్పును వీరిద్దరూ ఎలా ఆపారు? ఈ మిషన్‌లో వింగ్ కమాండర్ కావ్య లూత్ర(కియారా అద్వానీ) పాత్ర ఏంటి? ఈ ప్రశ్నలకు సమాధానమే మిగతా కథ.

# 70లోనూ అదే స్టైల్!





వయసు కేవలం ఒక అంకె మాత్రమేనని మెగాస్టార్ చిరంజీవి మరోసారి నిరూపించారు. 70 ఏళ్ల వయసులోనూ ఆయన తన స్టైల్, ఎనర్జీతో అభిమానులను ఫిదా చేస్తున్నారు. ఇటీవల రవి స్టూడియోస్ నిర్వహించిన ఒక ప్రత్యేక ఫొటోషూట్‌లో చిరంజీవి పాల్గొన్నారు. తన నివాసంలో జరిగిన ఈ షూట్‌లో ఆయన ఐదారు రకాల కాస్ట్యూమ్స్ మార్చి ఫొటోలకు ఫోజులిచ్చారు. ఈ ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఈ ఫొటోలలో చిరంజీవి లుక్స్ చూసిన నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. "70 ఏళ్లలో కూడా 40 ఏళ్ల కుర్రాడిలా అదరగొడుతున్నారు" అంటూ ప్రశంసలతో కామెంట్లు పెడుతున్నారు. ఆయన ఫిట్‌నెస్, గ్రేస్ చూసి ముగ్ధులవుతున్నారు. ఇటీవల 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమాలోని ఓ పాటలో చిరంజీవి స్టైలింగ్‌పై కొన్ని విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే, ఈ కొత్త ఫొటోషూట్‌తో ఆ విమర్శలన్నింటికీ ఆయన స్టైలిష్‌గా సమాధానం ఇచ్చారని అభిమానులు భావిస్తున్నారు.సినిమాల విషయానికొస్తే, 'భోళా శంకర్' తర్వాత కొంత విరామం తీసుకున్న చిరంజీవి, 2025లో మాత్రం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉండనున్నారు. ఆయన నటిస్తున్న 'మన శంకరవరప్రసాద్ గారు' జనవరిలో విడుదల కానుండగా, భారీ అంచనాలతో రూపొందుతున్న 'విశ్వంభర' వేసవిలో ప్రేక్షకుల ముందుకు రానుంది.వీటితో పాటు దర్శకుడు బాబీతో ఒక పవర్‌ఫుల్ యాక్షన్ సినిమా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో మరో వయలెంట్ డ్రామా చేయనున్నారు. శ్రీకాంత్ ఓదెల సినిమాలో చిరంజీవి సరికొత్త మేకోవర్‌లో కనిపించనున్నారని సమాచారం. ఇవి కాకుండా మరో రెండు, మూడు ప్రాజెక్టులు కూడా చర్చల దశలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ వయసులోనూ ఆయన చూపిస్తున్న డెడికేషన్ ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తోంది.

# ఇన్‌స్టాగ్రామ్ మెసేజ్‌తో మా ప్రేమ మొదలైంది

## : శోభిత గురించి చైతూ కామెంట్స్



నటుడు అక్కినేని నాగ చైతన్య, నటి శోభితా ధూళిపాళ వైవాహిక జీవితాన్ని ఆనందంగా గడుపుతున్నారు. తాజాగా వారి ప్రేమ ప్రయాణం గురించి చైతన్య ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. దాదాపు రెండేళ్ల పాటు ప్రేమలో ఉన్న ఈ జంట ఇటీవల వివాహ బంధంతో ఒక్కటైన సంగతి తెలిసిందే. తాజాగా ప్రముఖ నటుడు జగపతిబాబు హోస్ట్ చేస్తున్న 'జయమ్ము నిశ్చయమ్మురా' అనే టాక్ షోలో పాల్గొన్న చైతన్య, తన భార్య శోభితతో పరిచయం ఎలా జరిగిందో సరదాగా వివరించారు.

తమ ప్రేమకథకు సోషల్ మీడియానే వేదికైందని చైతన్య తెలిపారు. "నా భార్యను మొదటిసారి ఇన్‌స్టాగ్రామ్‌లో కలుస్తానని అస్సలు ఊహించలేదు. ఆమె వర్క్ నాకు బాగా తెలుసు. ఒకసారి నేను నా క్లౌడ్ కిచెన్ గురించి పోస్ట్ పెట్టినప్పుడు, ఆమె ఒక ఎమోజీతో కామెంట్ చేసింది. అక్కడి నుంచే మా మధ్య చాటింగ్ మొదలైంది. ఆ తర్వాత మేమిద్దరం కలుసుకున్నాం" అంటూ నవ్వుతూ గుర్తుచేసుకున్నారు.తన జీవితంలో శోభిత ప్రాధాన్యతను వివరిస్తూ, "శోభిత నా భార్య... ఆమె నా అతిపెద్ద బలం, మద్దతు. ఆమె లేకుండా నేను ఉండలేను" అని చైతన్య చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. వ్యక్తిగత జీవితంలో సంతోషంగా ఉన్న ఆయన, వృత్తిపరంగా కూడా కొత్త ప్రయోగాలు చేస్తున్నారు.ఇక సినిమాల విషయానికొస్తే, నాగ చైతన్య ప్రస్తుతం 'విరూపాక్ష' చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు కార్తీక్ వర్మ దండుతో ఒక హారర్ థ్రిల్లర్ చేస్తున్నారు. ఇటీవలే ప్రారంభమైన ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి 'కాంతార' ఫేమ్ అజనీష్ లోకనాథ్ సంగీతం అందిస్తుండగా, 2026లో సినిమా విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.